www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 1 మే 2025 8 పేజీలు

తూర్పుగోదావరి కాకినాడ కోనసీమ





యథేచ్ఛగా తాగునీటి వ్యాపారం

- అనుమతులు లేకుండా ఆర్‌ఒ ప్లాంట్లు
- నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు
- వేసవి వేళ ప్రజారోగ్యాలతో చెలగాటం
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తాగునీటి వ్యాపారం అన్ని చోట్లా యథేచ్ఛగా సాగుతోంది. ఎటువంటి అనుమతులు లేకుండానే ఇవి నడుస్తున్నాయి. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుంటూ పెద్ద ఎత్తున వ్యాపారం జరుపుతున్నాయి. ఈ వేసవిలో ప్రధానంగా తాగునీటి వ్యాపారం ఎక్కువగా జరుగుతూ ఉంటుంది. ఇదే అదునుగా వేసవి వేళ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. నిబంధనలను పూర్తిగా పక్కన పెట్టి వ్యవహరిస్తున్నా ఇటు మున్సిపల్ అధికారులు గానీ, ఇటు పంచాయతీ అధికారులు గానీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో పల్లె, పట్టణం అనే తేడా లేకుండా మినరల్ వాటర్ ప్లాంట్లు వందల్లో నడుస్తున్నాయి. ప్రభుత్వ అనుమతులు లేకుండానే ప్లాంట్ల నిర్వాహకులు జోరుగా నీటి వ్యాపారం సాగిస్తున్నారు. కాకినాడ నగరం, తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట పట్టణ ప్రాంతాలతో పాటు అన్ని మండల కేంద్రాలు, పలు పంచాయతీల పరిధిలో అనధికారికంగా వందలకొలదీ ప్లాంట్లు ఉన్నాయి. జిల్లాలో ఇలాంటివి సుమారుగా 1000 పైనే ఉన్నాయని సమాచారం. ఇళ్ళల్లోని బోర్లు, బావుల నుంచి నీటిని ట్యాంకులలోకి నింపి, ఎటువంటి క్లోరినేషన్ చేయకుండానే ఏవో కొన్ని రసాయనాలు వినియోగించి విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలు ప్రాంతాల్లో కుళాయిల ద్వారా వస్తున్న నీటిని తాగలేని అనేకమంది ఆర్‌ఒ ప్లాంట్ల నీటిపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలు సైతం ప్లాంట్ల వద్దకు వెళ్లి



కాకినాడ రూరల్‌లో తాగునీటి ప్లాంటు

రూ.10 నుంచి రూ.30 వరకూ వెచ్చించి తాగునీరు కొని తెచ్చుకుంటున్న పరిస్థితి ఉంది.పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పలు తాగునీటి పథకాలున్నా పూర్తిస్థాయిలో తాగునీరు అందించలేని దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే పలువురు తాగునీటిని కొనుగోలు చేసుకుంటున్నారు.

ప్రజలపై అదనపు భారం

రక్షిత తాగునీటి పథకాలు చాలా చోట్ల అక్కరకు రాకుండా పోవడంతో అనేకమంది ప్రైవేటుగా తాగునీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న విక్రయదారులు రూ.కోట్లలో వ్యాపారం నిర్వహిస్తున్నారు. బోర్లు, రక్షిత పథకాల నుంచి వస్తున్న నీటిని ఇతర అవసరాలకు ఉపయోగిస్తూ తాగునీటి కోసం మినరల్ వాటర్ 2లో..



అధికారులు పట్టించుకోవడం లేదు

తాగునీటి పేరుతో మోసం చేస్తున్న ప్రైవేటు జల కేంద్రాలను అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సి ఉన్నా ఎక్కడా తనిఖీల జాడ లేదు. పంచాయతీ పరిధిలో పిహెచ్‌సి వైద్యులు, ఆహార తనిఖీ అధికారి, ఎంపిడిఒలు తనిఖీలు చేయాలి. పట్టణాల్లో ఆర్‌డబ్ల్యుఎస్, టాస్క్ ఫోర్స్ అధికారులు పరిశీలించాలి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

- గొల్లపల్లి సురేష్, కొవ్వాడ, కాకినాడ రూరల్

రూ.లక్షల్లో వ్యాపారం

ప్రైవేటు వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కోట్లలో అమ్మకాలు సాగిస్తున్నారు. ఎక్కడా నిబంధనలు పాటించడం లేదు. గ్రామాల్లో ఇటీవల ప్రైవేటు ప్లాంట్లు ఎక్కువగా వెలిశాయి. ప్రస్తుతం వేసవి నేపథ్యంలో తాగునీటి వ్యాపారం పెరిగింది.

- రెడ్డిపల్లి రాజేష్, రాయుడుపాలెం, కాకినాడ రూరల్.

మాచవరంలో విషాదం

సింహాచలం ఘటనలో ఇద్దరు యువకుల మృతి

విశాఖ జిల్లా సింహాచలంలోని చందనోత్సవంలో జరిగిన ప్రమాదంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటం మండలం మాచవరం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. గ్రామంలోని కొర్లపాటి వారిపాలేనికి చెందిన పత్తి దుర్గా స్వామినాయుడు(28), కుంపట్ల మణికంఠ ఈశ్వరశేషారావు(26) దుర్మరణం పొందారు. దీంతో గ్రామంలో విషాదం అలముకుంది.

:: ప్రజాశక్తి - అంబాజీపేట ::


వార్త 8లో..




శేషారావు



స్వామినాయుడు




కార్టూ'నిజం'




8లో

కోరం లేక కౌన్సిల్ సమావేశం వాయిదా


8లో

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తొలగించాలి



అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పినిపే విశ్వరూప్

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - అల్లవరం

అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అల్లవరం పొలం గ్రామంలో నాతి శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహాన్ని పినిపే విశ్వరూప్ ఆవిష్కరించారు. మాజీ ఐఆర్ఎస్ అధికారి టి ఎస్ఎన్.మూర్తి జ్యోతి వెలిగించగా డాక్టర్ బసవా వరహాలు జెండా ఆవిష్కరణ చేశారు. పినిపే శ్రీకాంత్ పూలమాల అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పినిపే విశ్వరూప్ మాట్లాడుతూ అంబేద్కర్ ఒక దార్శనికుడు అని అటువంటి మహనీయుడు ఎప్పటికీ అందరివాడే అని అన్నారు. టి ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ చదువు మీదే ఆధార పడి ఉందని యువత అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో కొనుకు బాపూజీ, పెయ్యల పరశురాముడు, జల్లి శ్రీను, వడ్డి వీరాస్వామి, ఉండ్రు బాబ్జి, చింతా రామకష్ణ, కర్రి వెంకట రామరాజు, బొక్కా శ్రీను, ఎంపీటీసీ మౌనిక, పల్లి జేమ్స్, పులుసుగంటి రాజేశ్వరి, దాసరి అరుణ పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎపిడి రాంబాబు

ఉపాధి పనుల పరిశీలన


ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

భీమనపల్లి, విలసివిల్లి గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ చట్టం పనులను బుధవారం ద్వామా ఎపిడి డి.రాంబాబు పరిశీలించారు .మస్తర్లను పరిశీలించిన ఎపిడి రాంబాబు ఉపాధి కూలీలతో మాట్లాడి వారికి పలు సూచనలు ఇచ్చారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకాల ప్రాముఖ్యతను వారికి వివరించారు. ప్రతీ ఒక్కరూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ప్లాంటేషన్ మేనేజర్ త్రినాథ్, ఉపాధి ఎపిఒ ఎం.వీరబాబు, టిఎ కె.బాలరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ లు ఉన్నారు.

శ్మశానంలో భవనం ప్రారంభం

ప్రజాశక్తి - అల్లవరం

బోడసకురు గ్రామపంచాయితీ పరిధిలో రెండవ కాశీగా పేరు పొందిన శివాలయం ఆవరణలో వైనతేయ నది వద్ద హిందూ శ్మశాన వాటికలో దహన సంస్కారణలు చేయడానికి నిర్మించిన భవనాన్ని గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి బుధవారం ప్రారంభించారు. బోడసకుర్రు గ్రామం దాతలు మరియు పెద్దలు విరాళాలు రూ.పది లక్షలుతో దహన సంస్కారణలు చేయడానికి పొయ్యిలు, భవనాన్ని నిర్మించారు. కార్యక్రమంలో కలిగినీడి బేబీ, రొక్కాల నాగేశ్వరరావు, పాలకవర్గం సభ్యులు అడపా శ్రీను, ఆరవ చంటి, చుండూరి శ్రీను, రోళ్ళ అన్నవరం, మొయిల భీముడు, రోళ్ళ శ్రీను, రంకిరెడ్డి వెంకటేశ్వరావు, సాపే ధర్మరాజు, అప్పన పుల్లయ్య, వాసర్ల చిన్న మరియు గ్రామ పెద్దలు విరాళాలు ఇచ్చిన దాతలు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి, పాల్గొన్న గ్రామస్తులు

మెరుగైన సేవలతోనే గుర్తింపు

- కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్
- ఉద్యోగ విరమణ చేసిన మామిడికుదురు తహశీల్దార్ సుబ్రహ్మణ్యాచారి

ప్రజాశక్తి - మామిడికుదురు

విధి నిర్వహణలో మెరుగైన సేవలందించే అధికారులకు ప్రజలలో మంచి గుర్తింపు లభిస్తుందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు., బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు మామిడికుదురు మండల తహశీల్దార్ ఎదురువాడ వెంకట సుబ్రహ్మణ్యాచారికి కలెక్టర్ శాలువాతో సత్కరించి, నూతన వస్త్రాలు అందజేసి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నత విద్యా సముపార్జనతో ప్రభుత్వ కొలువు సాధించి ప్రభుత్వ పరిపాలనలో కీలక మైన రెవెన్యూ విభాగంలో అమూల్యమైన సేవలు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అత్యంత బాధ్యతగా 36 సంవత్సరాలుగా అంకిత భావంతో పనిచేసి పలువురు మన్ననలు పొందారన్నారు. విశ్రాంత జీవితం సుఖ సంతోషాలతో ఆయురా రోగ్యాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. డిఆర్ఒ బిఎల్ఎన్.రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వంలో బాధ్యతాయుతంగా ఉద్యోగంలో పనిచేసినప్పుడు జీవితంలో ఎంతో సంతృప్తిని కలుగ జేస్తుందన్నారు. విశ్రాంత జీవితం ఆయురారోగ్యాల తో సుఖ సంతోషంగా గడపాలని ఆమె ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన తాహసిల్దార్ సుబ్రహ్మణ్య చారి మాట్లాడుతూ1986 లో టైపిస్టుగా ఉద్యోగంలో ప్రవేశించి కృష్ణా జిల్లాలో సీనియర్ అసిస్టెంట్, ఉప తహశీల్దార్ గా పనిచేసి 2018 సంవత్సరంలో ఉద్యోగోన్నతిపై రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండల తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిం చానన్నారు 2019 లో రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యా లయంలో ఇఒగా, 2024 లో సాధారణ ఎన్నికల బదిలీల నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి తహశీల్దార్‌గా, సాధారణ ఎన్నికలు ముగిసిన అనంత రం బదిలీల్లో భాగంగా మామిడికుదురు మండల తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించానన్నారు. స్థానిక కలెక్టరేట్ నందు ఉద్యోగ పదవీ విరమణ పొందిన తహశీల్దార్ సుబ్రహ్మణ్యచారి దంపతులనుకలెక్టర్, డిఆర్ఒ, ఎఒ విశ్వేశ్వరరావు లు జ్ఞాపికలు అందజేసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



మామిడికుదురు తహశీల్దార్‌ను సత్కరిస్తున్న కలెక్టర్

సబ్ స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలం లో లోఓల్టేజి సమస్యను పరిష్కరించేందుకు వెల్ల గ్రామం వద్ద నూతన 33/11 కెవి ఉప విద్యుత్ కేంద్రానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం శంఖు స్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ద్రాక్షారామం ఉప విద్యుత్ కేంద్రం పరిధిలో వేసవి కాలంలో అధిక లోడ్ కారణంగా విద్యుత్ కేంద్రంపై భారం పడుతుండడంతో లో ఓల్టేజి సమస్యలు తలెత్తుతునాయన్నారు. లో ఓల్టేజి సమస్యలను అధిగమించడానికి వెల్ల గ్రామంలో రూ.3 కోట్ల 5 లక్షల 67 వేల అంచనా వ్యయంతో నూతనంగా 33/11 కెవి ఉప విద్యుత్ కేంద్రాన్ని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నట్లు మంత్రి వివరించారు. విద్యుత్ కేంద్రాన్ని నిర్మించడం వల్ల ద్రాక్షారామ విద్యుత్ ఉపకేంద్రం పై లోడు భారం తగ్గడంతోపాటు వెల్ల, వెల్ల సావరం, ఏరుపల్లి, హసన్బాద, ఉండూరు, బికె.పాలెం, ద్రాక్షారామ, కన్నడ తోట, ఆదివారపు పేట గ్రామాలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయడం వీలవుతుందన్నారు. విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో ఎక్కడ లోఓల్టేజి సమస్య తలెత్తకుండా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎపి ఇపిడి సిఎల్ ఎస్ఇ యడ్ల విజయానంద్, ఇఇ కె.రత్నాలరావు, డిఇఇ కె.మురళీ మోహన్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.రమణారావు, రామచంద్రపురం ఎంపిపి అంబటి భవాని, ద్రాక్షారామం సర్పంచ్ కొత్తపల్లి అరుణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మంత్రి సుభాష్ అన్నారు. ద్రాక్షారామం మార్కెట్ యార్డు లో బుధవారం వ్యవసాయ యాంత్రీకరణ పథకం లో భాగంగా ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలు పవర్ టిల్లర్‌లను ఆయన పంపిణీ చేశారు. మొత్తం 14 మంది రైతులకు రూ.లక్ష సబ్సిడీపై వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబటి భవాని, కూటమి నాయకులు, కంచుమర్తి బాబురావు, పార్టీ నాయకులు రాఘవన్, వ్యవసాయ అధికారి సత్య ప్రసాద్, కె.గంగవరం ఎఒ బలుసు రవి, ఎంపిడిఒ పద్మజ్యోతి, రైతులు, పాల్గొన్నారు. అనంతరం ద్రాక్షారామం గ్రామ సచివాలయం-2 లో బిసి కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్



సైఫాన్ నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

రైతు సమస్యల పరిష్కారానికి కృషి


ప్రజాశక్తి - ఆత్రేయపురం

రైతుల సమస్యల శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కషి చేస్తుందని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని లొల్ల గ్రామం వద్ద సైఫాన్‌ను అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .స్టేట్ డిజాస్టర్ మిటిగేషన్ నిధుల నుంచి రూ.2 కోట్ల 34 లక్షలఅంచనా వ్యయంతో చేయనున్న ఈ పనులు లొల్ల, వాడపల్లి, ర్యాలి గ్రామాల మీదుగా చేపట్టనున్నారనితెలిపారు. ఈ సైఫాన్ అభివృద్ధి పరచడం వల్ల రైతులకు మేలు జరగనుండటంతో ఆ గ్రామాల రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

6న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - రాజోలు

ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ సౌజన్యంతో ఈ 6న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంఎల్ఎ దేవ వర ప్రసాద్ తెలియచేశారు .బుధవారం ఎంఎల్ఎ చేతుల మీదుగా జాబ్ మేళా కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సుమారు 37 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటా యని 1000కి పైగా ఉద్యోగాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ1 సేవా సమితి అధ్యక్షులు, చెల్లుబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ రాజోలు నియోజక వర్గంలో ఉన్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ హరిశేషు, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, సఖినేటిపల్లి టిడిపి మండల ప్రధాన కార్యదర్శి తాడి సత్య నారాయణ, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ దేవ వరప్రసాద్

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీ వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి బుధవారం సీతానగరం మండలం వెదుళ్లపల్లికి చెందిన కొత్తపల్లి దొరబాబు సుధారాణి దంపతులు, రమేశచంద్ర కుటుంబ సభ్యులు రూ.1 లక్షా 700 ఆలయ డిసి నల్ల సూర్య చక్ర ధర రావుకు అందజేశారు. అలాగే విశాఖపట్నం కి చెందిన వెంకట కృష్ణ అన్నమాచార్య సంస్థ కు చెందిన నిర్వాహకులు శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారికి 46 గ్రాముల 2 మంగళ సూత్రములు, ఒక కేజీ న్నర వెండి పళ్లెం అందజేశారని ఆలయ డిసి తెలిపారు.

కాంగ్రెస్ జిల్లా కమిటీకి నియామక పత్రాల అందజేత

ప్రజాశక్తి - మామిడికుదురు

జిల్లా కాంగ్రెస్ కమిటీకి నియామక పత్రాలు అందిస్తున్న డిసిసి అధ్యక్షుడు చిట్టిబాబు బుధవారం అందజేశారు. పి.గన్నవరం నియోజకవర్గంలోని మామిడికుదురు మండలంలోని నగరం గ్రామంలో గల కాంగ్రెస్ పార్టీ ఆఫీసు నందు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండేటి చిట్టిబాబు నూతనంగా నియమింపబడ్డ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులకు రాష్ట్ర అధ్యక్షులు షర్మిలా రెడ్డి అనుమతి పొందిన పేర్లను బుధవారం ప్రకటించారు నగరంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏడుగురు జిల్లా ఉపాధ్యక్షులు, 8 మంది జిల్లా ప్రధాన కార్యదర్శులు, 1 జిల్లా కార్యదర్శి మొత్తం 16 మందిని ప్రకటించి వారికి నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఆరిఫ్, అమలాపురం నియోజవర్గ కో-ఆర్డినేటర్ అయితా బత్తుల సుభాషిని, రాజోలు కోఆర్డినేటర్ సరెళ్ల ప్రసన్న కుమార్, మామిడికుదురు మండల కాంగ్రెస్ అధ్యక్షులు అప్పన శ్రీరామకృష్ణ, చిట్టూరి సత్యనారాయణ చౌదరి, ముదునూరి మధురాజు, నిమ్మకాయల ప్రసాద్, కొండేటి వెంకటేశ్వరరావు, బొంతు రాజేంద్ర ప్రసాద్, గ్రంధి శేషగిరిరావు, పిచ్చెట్టి శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న డిసిసి అధ్యక్షుడు చిట్టిబాబు

పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - అమలాపురం

పట్టణాలు, గ్రామాలలో ప్రజలకు పారిశుధ్యం నిర్వహణపై పరిపూర్ణమైన అవగాహన కల్పిస్తూ ప్రజల జీవనశైలిలో మార్పులు తీసుకువస్తూ గ్రామాలను ఆహ్లాదక రం గా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.బు ధవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, ఇఓపిఆర్డిలతో సమావేశం నిర్వహించి స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్ర మాలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పనితీరు, ఐవిఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ నివేదికలపై చర్చలు, ఆవాసాల చుట్టుపక్కల కాలువలు, డ్రైయినేజీలు ప్రత్యేక డ్రైవ్ ద్వారా పరిశుభ్రత చర్యలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిపిఒ శాంత లక్ష్మి, ఎంపిడిఒలు, ఇఒఆర్డిలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాల తయారీ పరిశీలన

కపిలేశ్వరపురం: మండలంలోని బుధవారం అంగర శ్రీ గణపతి చేనేత పారిశ్రామికుల సహకార ఉత్పత్తి విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సందర్శించారు. వివిధ రకాల చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని చేనేత సహకార సంఘాలను ప్రభుత్వ పరంగా రాయితీ లతో ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ జిల్లా అధికారి పెద్దిరాజు, తహశీల్దార్ పి.చిన్నారావు, ఇన్చార్జి ఎంపిడిఒ రాజేంద్ర ప్రసాద్, సొసైటీ ఇన్ఛార్జి కె.గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్కుమార్

అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అడుగుజాడల్లో యువత నడవాలని అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు అన్నారు. బుధవారం అమలాపురం మండలం జనుపల్లి గ్రామంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతిలో ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా ఛైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, మాజీ ఎంపిపి బొర్రా ఈశ్వరరావు, మాజీ కౌన్సిలర్ దున్నాల దుర్గా, వాకపల్లి స్వామి నాయుడు, ఈతకోట నాగేశ్వరరావు, యువత తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ ఆనందరావు

వైసిపి బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వైసిపి బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆత్రేయపురం మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన కప్పల శ్రీధర్ జిల్లా వైసిపి అధికార ప్రతినిధిగా ఇటీవల నియమితులయ్యారు. తాడేపల్లిలో పార్టీ సెంట్రల్ ఆఫీస్ రాష్ట్రవ్యాప్త జిల్లా అధికారి ప్రతినిధుల వర్క్ షాప్లో పాల్గొని ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో హైదరాబాదులో ఉన్న చిర్ల జగ్గిరెడ్డి ని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా చిర్ల జగ్గి రెడ్డి మాట్లాడుతూ నాయకులంతా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు గొల్లపల్లి డేవిడ్రాజు కొత్తపేట ఎంపిపి మార్గాని గంగాధర్, కర్రి నాగిరెడ్డి, ముసునూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

శతాధిక వృద్ధుని మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండల పరిధిలోని కొత్తలంక గ్రామ పంచాయతీ రమాబాయి పేటకు చెందిన దాసరి సాహెబ్ (103) బుధవారం ఆయన స్వగృహంలో మరణించారు. సాహెబ్ కు కుమారుడు, కోడలు, ముగ్గురు మనమళ్ళు, ఒక మనమరాలు ఉన్నారు. సాహెబ్ మృతికి పలువురు సంతాపం తెలిపారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి

ప్రజాశక్తి - ఐ.పోలవరం

ప్రజా సాహితి ఆధ్వర్యంలో బుధవారం శ్రీశ్రీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పుల్లెపు వెంకటేశ్వరరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, విత్తనాల వరప్రసాదరావు, ప్రత్తి సత్తిబాబు, ఎం.ఎస్ ఎస్ఎన్.మూర్తి,ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా కార్యాలయానికి బీరువా బహూకరణ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

సామాజిక సేవలలో భాగంగా సమగ్ర శిక్షా జిల్లా కార్యాలయానికి పిఆర్టియు బీరువాను బహూకరించడం అభినందనీయమని డిఇఒ డాక్టర్ షేక్ సలీం బాషా పేర్కొన్నారు. బుధవారం పిఆర్టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరాల కృష్ణకుమార్, దీపాటి సురేష్బాబుల ఆధ్వర్యంలో సుమారు రూ.12వేలు విలువ చేసే బీరువాను అందజేశారు.ఈ కార్యక్రమంలో సిఎంఒ బివి.సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి జివిఎస్. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

ప్రజాశక్తి - అంబాజీపేట

వక్కలంక గ్రామంలో చెరువుపూడిక పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు సర్పంచ్ వాసంశెట్టి రేవతి, పెదబాబు ఆధ్వర్యంలో బుధవారం ఒఆర్ఎస్ ప్యాకెట్లు, వివిధ రకాల మందులను పంపిణీ చేశారు. ముక్కామల పిహెచ్సి ఎంపిహెచ్ఎ పి.ఏసుబాబు ఉష్ణోగ్రత నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సరోజినీ, తదితరులు పాల్గొన్నారు.



వక్కలంక పంపిణీ చేస్తున్న సర్పంచ్

యథేచ్ఛగా తాగునీటి వ్యాపారం

(మొదటి పేజీ తరువాయి)

క్యాన్లు కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల క్యాన్కు రూ.10 నుంచి రూ.30 వసూలు చేస్తున్నారు. కూలింగ్ బాటిల్ రూ.40 వసూలు చేస్తున్నారు. ఇలా డ్రింకింగ్ వాటర్ కోసం ప్రజలపై అదనపు భారం పడుతోంది. ఒక్కో ప్లాంటు నుంచి రోజుకు సుమారు 100 క్యాన్ల వరకు విక్రయాలు జరుగుతుండగా ఇలా జిల్లాలో అనధికారికంగా రోజుకు లక్షల లీటర్ల నీటి వ్యాపారం జరుగుతోంది. ఒక్కో కుటుంబం నెలకు రూ.400 నుంచి రూ.600 వరకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుంది.

నిబంధనలకు నీళ్లు

నీటిలో స్వచ్ఛతను కొలిచేందుకు టిడిఎస్ను ప్రామాణికంగా తీసుకుంటారు. నీటిలో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, సోడియం, బైకార్బొనేట్స్, క్లోరైడ్స్, సల్ఫేట్స్ కరిగి ఉంటాయి. టిడిఎస్ పిపిఎం స్థాయి 1000 దాటితే ఆ నీరు విషతుల్యం అవుతుంది. ఈ నీరు తాగితే మూత్ర పిండాలు పాడవుతాయి. జీర్ణవ్యవస్థ దెబ్బ తింటుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటైన నీటి శుద్ధి కేంద్రాల నుంచి నమూనాలు సేకరించి, నాణ్యతా ప్రమాణాలను అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. ప్రతి ప్లాంట్లో బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్ (బిఐఎస్) ప్రమాణాలు పాటించాలి. ఎస్ఎస్ఐ, ఐఎస్ఐ రిజిస్ట్రేషన్లతోపాటు కాలుష్య నియంత్రణ, ట్రేడ్ మార్క్ రిజిస్ట్రేషన్ వంటి 14 మార్గదర్శకాలు పాటించాల్సి ఉంటుంది.

అమరావతి 2.0 నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం

ప్రజాశక్తి - కొత్తపేట

అమరావతి 2.0 రాజధానిని పునర్నిర్మాణానికి ఎన్డిఎ కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది అని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు. అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రాజధాని అమరావతి పూర్తయితే 175 నియోజకవర్గాల యువతకు ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతాయి.

రాజధాని పనులు వేగవంతం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని పనులు వేగవంతం అయ్యాయని జిల్లా టిడిపి అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు.

క్రైం వార్తలు

దోపిడీకి పాల్పడిన నలుగురి అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామం పెట్రోలు బంకు వద్ద దారి దోపిడీకి పాల్పడిన నిందితులను బుధవారం అరెస్టు చేశామని ఎస్ఐ ఎం.లక్ష్మణ్ తెలిపారు. వివరాలు ఇవి.. గత నెల 27న వీరేశగుళ్ల పెట్రోలు బంకు వద్ద వరికోత యంత్రానికి డీజిల్ కొట్టించడానికి వచ్చిన తమిళనాడుకు చెందిన వ్యక్తి వచ్చాడు. అతనిని నుంచి గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు రెండు మోటారు సైకిళ్లపై వచ్చి రూ.10వేలు నగదు, సెల్ఫోన్ అపహరించారు. దీనిపై బాధితుడు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. బుధవారం రామచంద్రపురం సిఐ వెంకటనారాయణకు వచ్చిన సమాచారంతో ఉదయం ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్, సిబ్బందితో కలిసి వేగాయమ్మపేట వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. దోపడికి పాల్పడిన నలుగురు వ్యక్తులు పోలీసులకు చిక్కారు. వారి నుంచి ఘటన సమయంలో ఉపయోగించిన రెండు మోటారు సైకిళ్ళు, రూ.200 నగదు, ఒక సెల్ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. దోపిడికి పాల్పడిన వారిలో దొండపాటి కుమార్ మినహా మిగతా ముగ్గురు మైనర్లుగా గుర్తించామన్నారు.. నిందితులను మేజిస్ట్రేటు ఆదేశాల మేరకు రిమాండుకు తరలించగా, మిగతా ముగ్గురిని రాజమహేంద్రవరం జువైనల్ హోంకు తరలించామన్నారు.

ఫ్లెక్సీ ధ్వంసంపై కేసు నమోదు

ప్రజాశక్తి - పెరవలి

అన్నవరప్పాడులో సమత యోజన సంఘం, అరుంధతి సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్, బాబు జగ్జీవన్రామ్ జయంతి సందర్భంగా వైఎస్ఆర్ కాలనీ ఎదురుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గత నెల 27న రాత్రి అదే గ్రామానికి చెందిన ఆకుల మణికంఠ అయ్యప్పస్వామి, అడబాల గణపతి దొంగతనం చేసిన డబ్బులతో మద్యం తాగి 4 ఫ్లెక్సీలను ధ్వంసం చేశారు. దీనిపై కేసు నమో దు చేసి ఇరువురిని అరెస్టు చేసి కోర్టుకు తరలిం చినట్లు ఎస్ఐ ఎం.వెంకటేశ్వర రావు తెలిపారు. అలాగే పెరవలి గ్రామానికి చెందిన ఉంగండ యేసును డ్రంక్ అండ్ డ్రైవ్లో అదు పులో తీసుకొని కోర్టుకు తరలించగా నిందితునికి 5 రోజులజైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

మల్లేపల్లిలో రోడ్డు ప్రమాదం

ప్రజాశక్తి-గండేపల్లి

మల్లేపల్లి గ్రామ శివారులో పెట్రోలు బంకు ఎదురుగా బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. తాళ్లూరు గ్రామం నుండి ఏడుగురు కారులో తిరుపతి ప్రయాణమ య్యారు. మల్లేపల్లి గ్రామ శివారు వచ్చేసరికి హైవే అధికారులు ఏర్పాటు చేసిన సేఫ్టీ కోన్ గాలికి ఎగిరి రోడ్డు మధ్యలో పడింది. దీంతో ముందు వెళుతున్న బైకు సడన్ బ్రేక్ కొట్టడంతో వెనకున్న కారు ఆగింది. దీంతో వెనక వస్తున్న వ్యాను కారుని వెనకనుంచి ఢీకొట్టింది. వ్యాను నెమ్మదిగా రావడంతో కార్లో ఉన్నవారికి ఎటువంటి గాయాలూ కాలేదు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- తాళ్లరేవు

గాడిమొగ వెళ్లే రహదారిలో తిమ్మరాజుపురం జంక్షన్ వద్ద బుధవారం స్పీడ్ బ్రేకర్ను గుర్తించలేక జరిగిన రోడ్డు ప్రమాదం లో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థాని కులు తెలిపిన వివరాలివి.. గాడిమొగ వైపు నుంచి తాళ్లరేవు వస్తున్న వైదాడి వీర్రాజు కు ఈ ప్రమాదంలో గాయపడ్డాడు. అతనిని కాకినాడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా వైద్యం అందించ లేమని వైద్యులు తెలుపగా బుధవారం కాకినాడ జిజిహెచ్కు తరలిం చారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.



నిరసన తెలుపుతున్న మాల మహానాడు నాయకులు

వర్గీకరణ రద్దు చేయాలని కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక గడియార స్తంభం సెంటర్లో రాక్స్ మాల మహానాడు నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కొంకి వెంకటరావు ఆధ్వర్యంలో ఎస్సి వర్గీకరణ రద్దు చేయాలని బుధవారం కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాక్స్, మాల మహానాడు నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను వెంటనే రద్దు చేయాలని లేకుంటే దేశవ్యాప్త ఉద్యమంగా ఈ నిరసన కార్యక్రమాన్ని మారుస్తామని, ప్రభుత్వాలను కూలదోస్తామని హెచ్చరించారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సి వర్గీకరణ పై తప్పుడు విధానాన్ని అవలంబిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి చికురుమెల్లి కిరణ్ కుమార్, కాశీ వీర వెంకట సత్యనారాయణ, వెంకట్ పోతుల సుందరం, వర లక్ష్మీనరసింహ రామ్, జిత్తుక రాంబాబు, బొక్కా రామచంద్రరావు, బీర అన్నవరం, పులపర్తి వెంకటేశ్వరరావు, గుర్రాల రాంబాబు, గోటం సాయి, మాకే సిద్ధు, నాగవరపు శ్రీను, చిన్న వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పనులకు భూమిపూజ చేస్తున్న ఎంఎల్ఎ జోగేశ్వరరావు

వెదురుమూడిలో పూడిక తీత పనులు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

వెదురుమూడిలో చెరువు పూడికచేత పనులను బుధవారం ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రారంభించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఆజాదీకా అమత్ మహోత్సవంలో భాగంగా అమత్ సరోవర్ పథకంలో రూ.21.48 లక్షల అంచనాతో పశువుల చెరువు పూడిక తీత పనులకు ఎంఎల్ఎ వేగుళ్ళ కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో పుచ్చల శ్రీనివాస్, బోణం వెంకటశ్రీనివాస్, చుండ్రు మురళీ కృష్ణ, ఇళ్ళ రాంబాబు, బూరయ్య, చుండ్రు అచ్యుత రామారావు, బాపిరాజు, రాజు, సత్తిబాబు, వెంకట్రావు, ఫీల్డ్ అసిస్టెంట్ బోణం సత్తిబాబు, పాల్గొన్నారు. వెదురుమూడిలో నిర్మించిన సిసి రహదారులను ఎంఎల్ఎ వేగుళ్ళ ప్రారంభించారు.

పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఏకగవాక్ష విధానంలో త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గడచిన త్రైమాస కాలంలో అందిన దరఖాస్తుల పరిష్కారం, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహనికి వివిధ రాయితీల మంజూరు. పిఎం విశ్వకర్మ యోజన, క్లస్టర్ డెవలప్‌మెంట్ వంటి అంశాలపై పలు శాఖల అధికారులతో సమీక్షించారు. గత త్రైమాస కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ మొత్తం 196 దరఖాస్తులు అందగా, ఆయా శాఖల ద్వారా 177 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామని, రెండు దరఖాస్తులను తిరస్కరించామన్నారు. 17 దరఖాస్తులు వివిధ శాఖల వద్ద పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులు అన్నిటిపై నిర్దిష్ట గడువులోపు తగిన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ, విద్యుత్, సేల్ టాక్స్, తదితర రాయితీల క్రింద జిల్లాలో ఉత్పాదన, సేవా రంగాల్లోని 33 యూనిట్లకు సుమారుగా రూ.90 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాల జారీకి కమిటీ ఆమోదించిందన్నారు. ఎంఎస్‌ఎంఇ క్లస్టర్ అభివద్ధి కార్యక్రమం ద్వారా జిల్లాలో అర్హత కలిగిన క్లస్టర్‌లు త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. ప్రధానంగా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

సూక్ష్మ, చిన్న పరిశ్రమల క్లస్టర్ అభివృద్ధి పథకం కింద జిల్లాలో ప్రతిపాదించిన క్లస్టర్లు ప్రతిపాదనలను మే15 నాటికి సమర్పించాలన్నారు. ఎపిఐఐసి ద్వారా పెద్దాపురం ఇండస్ట్రియల్ పార్కులో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సలో బ్లాక్ నిమిత్తం ఆసక్తి గల పారిశ్రామికవేత్తల నుంచి ప్రతిపాదనలను మే 5లోగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎపిఐఐసి వద్ద భూములు తీసుకున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తమ పరిశ్రమల స్థాపనకు గడువు పొడిగిస్తూ కమిటీ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. పరిశ్రమల శాఖ జిఎం సిహెచ్.గణపతి, ఎడి ఎస్.విజయ్ కుమార్, ఆర్‌టిఒ జివి.శివారెడ్డి, ఎ.రమణా రెడ్డి పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర

ప్రజాశక్తి-కాజులూరు

రైతు సేవా కేంద్రంలో ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని మండల వ్యవసాయ అధికారి వి.అశోక్ తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రైతు సేవా కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి మాత్రమే లభిస్తుందని తెలిపారు. రైతులు, కౌలు రైతులు రైతు సేవ కేంద్రంలో ఉన్న సిబ్బందికి తమ ధాన్యాన్ని తేమ శాతం పరీక్షించుకున్నాక 17 శాతం లోపు ఉండేలా రైతులు చూసుకోవాలన్నారు. మద్దతు ధరతో పాటు ఖర్చులు కూడా ఇస్తారన్నారు. బహిరంగ మార్కెట్‌లో మద్దతు ధర లోపు మాత్రమే వస్తుందని, రైతులకు మద్దతు ధర లభించాలంటే రైతు సేవా కేంద్రంలో తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రంలో మద్దతు ధర లభించకపోతే ఫిర్యాదు చేయాలని కోరారు.

జగన్‌ను సిఎంను చేయడమే ధ్యేయం

ప్రజాశక్తి-శంఖవరం



వైఎస్.జగన్‌తో ముదునూరి

వైసిపి అధినేత వైఎస్.జగన్‌ను మరలా రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేయడమే ధ్యేయంగా పని చేస్తానని పార్టీ నరసాపురం పార్లమెంటు పరిశీలకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు అన్నారు. పార్టీ తనను నరసాపురం పార్లమెంటరీ పరిశీలికునిగా నియమించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను త్వరలో ఆ పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని నియోజ వర్గంలో నాయకులను కార్యకర్తలను కలిసి సమన్వయం చేసుకుంటూ కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండకడుతూ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ నరసాపురం పార్లమెంట్లో వైఎస్ఆర్ పార్టీని బలోపేతం చేస్తానని ముదునూరి స్పష్టం చేశారు.

నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ప్రజాశక్తి-కిర్లంపూడి

మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు భారీ వర్షానికి కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలో సుమారు 20 విద్యుత్ స్తంభాలు నేలమట్టం అయ్యాయి. రామచంద్రపురం గుండా కిర్లంపూడి మండలంలో సుమారు పది ఊర్లకు విద్యుత్ సరఫరా అవుతోంది. రామచంద్రపురం గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్, జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రాత్రికి రాత్రే కిర్లంపూడి ఎలక్ట్రికల్ ఎఇ, జగ్గంపేట ఎలక్ట్రికల్ డిఇతో మాట్లాడి బుధవారం ఉదయం 20 కొత్త స్తంభాలు రప్పించారు. బుధవారం ఉదయం నుండి సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్ విద్యుత్ శాఖ అధికారులతో, విద్యుత్ శాఖ ఉద్యోగులతో సమన్వయం చేస్తూ దగ్గరుండి స్తంభాలు వేయించారు. తెగిపోయిన ఎలక్ట్రికల్ వైర్లను వేయించారు. వీలైనంత త్వరగా అన్ని గ్రామాలకు విద్యుత్ వచ్చే ఏర్పాటు చేస్తున్నామని సర్పంచ్ తెలిపారు.



సభలో ప్రసంగిస్తున్న ఎంఎల్ఎ చిన్నరాజప్ప

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి - పెద్దాపురం

క్రీడల అభివద్ధికి ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సాహకాలు అందిస్తుందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక మహారాణి కళాశాలలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, కాకినాడ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నెల రోజులపాటు జరిగే జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సమ్మర్ కోచింగ్ శిబిరాన్ని బుధవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. అనంతరం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఎక్కువమంది యువతను క్రీడల్లో భాగస్వాములను చేయాలన్నారు. చిన్ననాటి నుండి క్రీడలలో ప్రోత్సహించటం వల్ల జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు అభివృద్ధి చెందుతారన్నారు. రాజా సూరిబాబు రాజు మాట్లాడుతూ క్రీడలు నిర్వహించటం ద్వారా క్రీడాకారుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ సమ్మర్ కోచింగ్ శిబిరం మే 31 వరకు జరుగుతుందన్నారు. 8 నుంచి 16 ఏళ్ల మధ్య వయసు బాలబాలికలకు అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇస్తారన్నారు. బాలురకు రెసిడెన్షియల్, బాలికలకు నాన్ రెసిడెన్షియల్‌గా శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మెయిన్ కోచ్ ప్రసాద్ రెడ్డి, కె.కొండలరావు, కె.వీరబాబు, ఉమామహేశ్వరరావు, మాజీ ప్రిన్సిపాల్ ప్రభాకర్ రావు, తూతిక రాజు, రంధి సత్యనారాయణ, పెదిరెడ్డి నరేష్, పానంగిపల్లి చలపతిరావు, మార్ని చిన్న, జి.చందు, కొరుపూరి రాజు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

యానాం : స్థానిక కె.జంక్షన్ వద్ద శ్రీలక్ష్మీ శ్రీనివాస జువెలర్స్ అధినేత అద్దేపల్లి కృష్ణ బుధవారం మజ్జిక చలివేంద్రాన్ని ప్రారంభించారు. యత్రా సుబ్బారాయుడు, వర్తక సంఘ సెక్రటరీ కాపగంటి గోపాలకృష్ణ, కంచర్ల రాంపండు, కలకాల శ్రీను, రాంబాబు, సూరిబాబు, రాజు పాల్గొన్నారు.

మే 15న చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపల్ చైర్‌పర్సన్ మార్పునకు సంబంధించి గత రెండు నెలలుగా నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెర పడనుంది. చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణపై అవిశ్వానికి సంబంధించి ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు మే నెల 15వ తేదీని ఖరారు చేస్తూ జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తర్వులు బుధవారం సామర్లకోట మున్సిపల్ కార్యాలయానికి అందాయి. కాకినాడ ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబును మున్సిపల్ ఎన్నికలకు ప్రత్యేకాధికారిగా నియమించారు. సామర్లకోట మున్సిపాలిటీలో 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైసిపి 31వార్డులకు గానూ 29 వార్డుల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. అప్పట్లో వైసిపి ఇన్‌ఛార్జి అయిన దవులూరి దొరబాబు రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా పదవిలో ఉన్నందున అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సూచనలతో ఒకే కుటుంబంలో రెండు పదవులు ఉండకూడదనే నిబంధనతో దొరబాబు గంగిరెడ్డి అరుణను స్వల్పకాల చైర్‌పర్సన్‌గా నియమించారు. ఇటీవల చైర్‌పర్సన్‌ను మార్పు చేసే యోచనలో వైసిపి కౌన్సిలర్‌లు ప్రయత్నాలు జరుపుతూ వస్తున్నారు. ఈ విషయంలో చైర్‌పర్సన్ అరుణకు, ఇంచార్జి దొరబాబు, ఆయన తండ్రి దవులూరి సుబ్బారావు మిగిలిన మెజారిటీ వైసిపి కౌన్సిల్లర్లతో విభేదాలు భయట పడ్డాయి. దీంతో రెండుసార్లు వైసిపి కౌన్సిలర్లు 22 మంది సంతకాలతో చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానానికై అనుమతి కోరుతూ జిల్లా కలెక్టర్‌ను కలిసి లెటర్లు అందజేశారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి

ప్రజాశక్తి - యంత్రాంగం

కడియం స్థానిక శాఖా గ్రంథాలయంలో మహాకవి శ్రీశ్రీ జయంతిని ఘనంగా నిర్వహిం చారు. బుధవారం గ్రంథాలయ అధికారిణి శెట్టిపల్లి శ్రీదేవినిర్మల అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమంలో చెల్లపిళ్ల వేంకట శాస్త్రి కళాసేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాస రావు పాల్గొని శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్షక, శ్రామిక, పీడిత, నిమ్న వర్గాల అభ్యున్నతి కాంక్షించేలా శ్రీశ్రీ తన సాహిత్యాన్ని రచించారని అన్నారు. సాంప్రదాయ పద్ధతుల్లో సాగు తున్న తెలుగు కవిత్వాన్ని, సాహిత్యాన్ని ఆధునికత సంతరిం చుకునేలా ముందుకు సాగారని కొనియా డారు. ఈ కార్యక్ర మంలో కడియం నీటి సంఘం అధ్యక్షులు చిక్కాల ఈశ్వరరావు, బోణం సత్యనా రాయణ, కళ్యాణం సూరిబాబు, ముగతా లంకేశ్వ రరావు, వేములూరి భాస్కరరావు, గారపాటి తాతబ్బాయి పాల్గొన్నారు. **రాజానగరం** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో శ్రీ శ్రీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపల్ ఆచార్య డి జ్యోతిర్మయి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి ప్రసన్నశ్రీ సందేశాన్ని ఆమె విద్యార్థులకు వివరించారు. తూటాల్లాంటి మాటలతో ఆకలి రాజ్యంపై రక్తాక్షరాలు చిందించిన శ్రీశ్రీ తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ డి.లక్ష్మీ నరసమ్మ, విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **రాజమహేంద్రవరం** ఆర్ట్స్ కళాశాలలో శ్రీశ్రీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర మాట్లాడారు. శ్రీశ్రీ కేవలం ఒక కవి మాత్రమే కాదని, ఒక గొప్ప తాత్వికుడు, సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఆయన సాహిత్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల తెలుగు బాగా అధిపతి డాక్టర్ పి.ఎ.సత్యనారాయణ, ఎస్‌కె.జరీనా, డాక్టర్ బి.సుబ్బలక్ష్మి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కడియంలో శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిర్వహకులు

మెగా జాబ్ మేళా 9వ తేదీకి వాయిదా

ప్రజాశక్తి - నిడదవోలు

నియోజకవర్గ యువతీ, యువకులకు ప్రయివేట్ రంగంలో ఉపాధి కల్పించే లక్ష్యంతో ఈ నెల 3న తలపెట్టిన జాబ్‌మేళాను మే 9వ తేదీకి వాయిదా వేసినట్లు నియోజకవర్గ ఎంఎల్ఎ, మంత్రి కందుల దుర్గేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి 6వ తేదీ వరకు వియత్నాంలో నిర్వహించే బుద్ధ భగవానుడి అవశేషాల ప్రదర్శనకు భారత దేశం తరపున కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజుతో కలిసి వెళ్లాలని పిఎంఒ నుంచి వచ్చిన ఆదేశాల నేపథ్యంలో తాను వియాత్నం వెళ్తున్నట్లు తెలిపారు. కావున ఈ నెల 3న నిర్వహించాల్సిన జాబ్‌మేళాను మే 9వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. మే 9వ తేదీన స్థానిక ఎస్‌విడి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

4న కవులు, గాయకుల సమ్మేళనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక మోడల్ కాలనీలోని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం భవనంలో మే 4వ తేదీన కవులు, గాయకుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ సేవా కేంద్రం (ఆస్క్) ఛైర్మన్ లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి సుమారు 100 మంది కవులు వారి పేర్లు నమోదు చేసుకున్నారని, ఆసక్తి కలిగిన వారు ఈ సమ్మేళనంలో పాల్గొనవచ్చునని అన్నారు. అంబేద్కరిజం పేరిట జరిగే కవి సమ్మేళనంలో పాల్గొన్న వారందరికీ సత్కారం, జ్ఞాపిక బహుకరిస్తామన్నారు.

పీజీ సెట్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గురువారం నుంచి రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో ఉచితంగా పిజి సెట్‌పై శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణకు 150 మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. రసాయన శాస్త్ర విభాగ అధిపతి టి.శ్రీనివాసరావు, పిజి సెట్ కోచింగ్ సమన్వయకర్త డాక్టర్ ఎం.శాంతకుమారి, ఎల్ఎంఎస్ అండ్ ఎస్‌టిసి సమన్వయకర్త బి.వెంకట్రావు, ఇతర అధ్యాపకులు పాల్గొంటారని తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి - దేవరపల్లి

గ్రామాల్లో శాంతిభద్రతలపై సిఐ నాయక్ ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన విఆర్ఒలు, కార్యదర్శుళతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఇటీవల కాలంలో ఫ్లెక్సీలు వల్ల, సిసి కెమెరా పర్యవేక్షణలో, శాంతిభద్రతల దృష్ట్యా, పోలీసుల గస్తీ విషయంలో, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఎస్ఐ సుబ్రహ్మణ్యం వివరించారు. శాంతిభద్రతల విషయంలో ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపిపి కుప్పాల దుర్గారావు, ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ వేణుగోపాల్, ఇఒపిఆర్‌డి రాజారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ

ఫ్లెక్సీలతో మూతపడిన బస్ షెల్టర్

ప్రజాశక్తి - చాగల్లు

స్థానిక మెయిన్ బజార్‌లో ఉన్న ఆర్‌టిసి బస్ షెల్టర్ ఫ్లెక్సీ బోర్డులతో మూతపడింది. వీటికితోడు ఆటోలు సైతం అక్కడే నిలపడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. నిడదవోలు నుంచి పంగిడి వైపు నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఒకపక్క ఎండలు మండుతున్నాయి. దీంతో ప్రయాణికులు బస్ షెల్టర్‌లో చేదతీరే పరిస్థితులు కరువయ్యాయి. గతంలో ఇదే బస్ షెల్టర్‌లో లైటింగ్ సదుపాయంతోపాటు, తాగునీటిని ప్రయాణిల సౌలభ్యంగా ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం బస్ షెల్టర్ కన్పించకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో దానిలోకి వెళ్లేందుకు ప్రయాణికులు అవకాశం లేకుండా పోయింది. దీంతో మండే ఎండలోనే ప్రయాణికులు నిల్చుని ఆపచోపాలు పడుతున్నారు. మరోపక్క ఆటోలు బస్ షెల్టర్ ఎదురుగానే నిలపడంతో ప్రయాణికులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్ షెల్టర్ వద్ద ఫ్లెక్సీలు, ఆటోలు

పుస్తకాలు, పెన్నుల అందజేత

ప్రజాశక్తి - దేవరపల్లి

మండలంలోని యర్నగూడెం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి బ్యాంక్ ఆఫ్ బరోడా సీనియర్ బ్రాంచ్ మేనేజర్ గుడివాడ నరేంద్రకుమార్ నాయుడు పాల్గొని విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రతీ ఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ ట్రైనర్ మరపట్ల మురళీ, పుట్టా పోసిబాబు, ముంగర అయ్యన్న, లైబ్రేరియన్ జి.అనిత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్ నరేంద్రకుమార్

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బుధవారం వివిధ పరీక్షల కోసం, వైద్య సేవల కోసం వచ్చిన గర్భిణులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ బృందం సభ్యులు పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ మన పెద్దాపురం ఫేస్‌బుక్ బృందం ఆధ్వర్యంలో మాతృత్వం కార్యక్రమంలో భాగంగా 56వ బుధవారం ఈ అన్నదానం నిర్వహించామన్నారు. జర్మనీలో స్థిరపడిన బులుసు శ్రీ హర్ష, లక్ష్మీ సౌజన్య దంపతుల సహాయ సహకారాలతో 150 మంది గర్భిణులకు 15 రకాల పౌష్టికాహార వంటకాలతో అన్నదానం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో బులుసు శ్రీహర్ష, వంశీ, నాగలక్ష్మి, బల్ల లక్ష్మి, సత్య రాణి, ఆత్మారి లక్ష్మి, రత్నం, భుజంగరావు, నరేష్, నవీన్ నాని, కొరుకొండ ప్రశాంత్, బొడ్డు స్వామి, ఆనంద్, హైదర్ అలీ తదితరులు సేవలందించారు.

కథలు చదవడంలో బాలలకు శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞానిక శిబిరంలో బుధవారం బాలలకు కథలు చదవడంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు జి.లక్ష్మీనారాయణ విటమిన్లు, శరీర ఆరోగ్యంలో వాటి పాత్ర, ప్రాముఖ్యత బాలలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఆహార పదార్థాలలో ఉండే విటమిన్లు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, సింగం బుల్లియ్య, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

ఫ్రీ సీట్ల కేటాయింపునకు 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఫ్రీ సీట్లకు సంబంధించి మే 2వ తేదీ నుండి దరఖాస్తులు స్వీకరిస్తామని డిప్యూటీ డిఇఒ ఈరంకి ప్రభాకరశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ మే 19వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. విద్యా హక్కు చట్టం సెక్షన్ 12 (1)(సి) ప్రకారం ప్రైవేటు స్కూల్స్‌లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయిస్తారన్నారు. పేద కుటుంబాల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. www.cse.ap.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18004258599 ను సంప్రదించవచ్చన్నారు.

2న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కాజులూరు

విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అవాంతరాలను తొలగించేందుకు 2వ తేదీన విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ ఉదయ భాస్కర్ తెలిపారు. శు క్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గొల్లపాలెం, ఆర్యవటం, బంధనపూడి, మతుకుమిల్లి, తర్లంపూడి, చీకట్లవారిపేట, చేదువాడ, దేగలపేట గ్రామాల్లో ట్రీ ట్రిమ్మింగ్ నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించవలసిందిగా కోరారు.

రైతులకు వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం మూడో రోజు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు, తెలుగు పద్యాలు భావాలు, జనరల్ సైన్స్ క్లాసులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు తూము రౌతు శ్రీనివాసరావు, అప్పన్న బాబు, విశ్రాంత ఉపాధ్యాయులు, గ్రంథాలయ పాలకుడు కవికొండల సత్యనారాయణ విద్యార్థులు ఉన్నారు.

సింహాచలం ఘటన ప్రభుత్వానిదే బాధ్యత

ప్రజాశక్తి-కిర్లంపూడి

విశాఖ జిల్లా సింహాచలం సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో యాత్రికులు మృతిపై వైసిపి ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, ఈ సంఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనలో బాధితులకు న్యాయం జరిగే వరకూ వైసిపి అండగా ఉంటుందన్నారు.

రైతు సేవా కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం


కల్లాలలో ధాన్యం పరిశీలిస్తున్న జెసి రాహుల్ మీనా

ధాన్యం పంటకు గిట్టుబాటు ధర లభించేందుకు రైతులు తాము పండించిన ధాన్యాన్ని ఆర్‌ఎస్‌కె ధాన్యం కొనుగోలు కేంద్రాలకే విక్రయించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. బుధవారం పెద్దాపురం మండలం జి.రాగంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆర్‌ఎస్‌కె పరిధిలో ధాన్యం ఆరబెట్టిన కల్లాలను, కల్లాలలో ధాన్యం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు సంబంధించి అన్ని సదుపాయాలూ కల్పించామన్నారు. అవసరమైన గోనెసంచులు అందుబాటులో ఉంచామన్నారు. ధాన్యం అమ్మకంలో ఎదుర్కొంటున్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తేమ శాతం విషయంలో మిల్లర్లు ఇబ్బందులు పెడుతున్నారని, మిల్లుల్లో బ్యాంకు గ్యారంటీ అంశాలు జెసికి వివరించారు. దీనిపై జెసి సానుకూలంగా స్పందించారు. మిల్లర్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. బ్యాంకు గ్యారంటీలు వచ్చే విధంగా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు. నాణ్యతా ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని, కల్లాలలో ఉన్న ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డిఎం, ఆర్‌డిఒ శ్రీరమణి, ఎడిఎ దైవ కుమార్, తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి కె.సంజయ్ కుమార్, రైతులు మోదుకూరి ఆదినారాయణమూర్తి, దేవళ్ల సతీష్, దూసర్లపూడి ఏసుబాబు, బిక్కిన వెంకటేశ్వర్లు, దేవళ్ల బోసు, బులిరాజు, శేషాద్రి, కాశీ, ఉపేంద్ర పాల్గొన్నారు.

రోడ్డు దుస్థితిని నిరసిస్తూ రాస్తారోకో

ప్రజాశక్తి-ఏలేశ్వరం


రోడ్డు దుస్థితిపై ధర్నా చేస్తున్ననాయకులు

శిథిలావస్థకు చేరుకున్న మండలంలోని గిరిజన గ్రామాలను కలిపే రమణయ్యపేట-జె అన్నవరం ఆర్ అండ్ బి రహదారి పునర్నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతూ పలు ప్రజా సంఘాలు బుధవారం రాస్తారోకో చేపట్టాయి. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా రాష్ట్ర కార్యదర్శి కోసిరెడ్డి గణేష్ మాట్లాడుతూ ఎంతోకాలంగా శిథిలావస్థకు చేరుకున్న రహదారిని నిర్మించాలని డిమాండ్ చేస్తూ అనేక ఉద్యమాలు చేపట్టిన గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యమం చేసి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, నారా లోకేష్‌కు వినతి పత్రాలు సమర్పించి ఆరు నెలలు అవుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడన్నారు. అనునిత్యం వేలాదిమంది అల్లూరి జిల్లాకు ప్రయాణిస్తారన్నారు. ఈ రహదారిపై అనేక ప్రమాదాలు సంభవించి పలువురు గాయాల పాలయ్యారని, వాహనాల మరమ్మతులు వచ్చి నిలిచిపోయాయని అన్నారు. గిరిజన ప్రాంతాల నుండి రోగులను, గర్భిణులను మైదాన ప్రాంతాలకు తరలించే అంబులెన్స్ వాహనాలు సైతం మరమ్మతులకు గురై నిలిచిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణాలు చేపట్టకపోతే మే నెల తరువాత రోడ్డుకి అడ్డంగా గోడ నిర్మించి తమ నిరసనను ప్రభుత్వం దృష్టికి వెళ్లేలా ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు నాగులపల్లి అర్జునుడు, రెడ్డి ఆనంద పాల్, మసిరపు రాజారావు, పల్లి కొండలరావు, నాగిశెట్టి సత్తిబాబు ఉన్నారు.

రాజధాని పునర్నిర్మాణంతో బంగారు భవిత

ప్రజాశక్తి-కాకినాడ

సిఎం చంద్రబాబు దూరదృష్టితో చేపట్టిన రాజధాని అమరావతి పునర్నిర్మాణంతో భావితరాలకు ఎంతో భవిష్యత్తు ఉంటుందని టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. చంద్రబాబు గతంలో హైటెక్ సిటీ వంటి నగరాలను అభివృద్ధి చేశారని, తద్వారా ఎన్నో వేల కోట్ల టర్నోవర్ జరిగి ఎంతో మందికి ఉపాధి కలిగిందని చెప్పారు. బుధవారం కాకినాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నవీన్ కుమార్ మాట్లాడారు. తొలుత కాశ్మీర్ ఉగ్రదాడి మృతులకు, సింహాచలంలో యాత్రికుల మృతికి ఆయన సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ మాజీ సిఎం జగన్ పెట్టుబడులు పెట్టించేందుకు ఆసక్తి కనబరచలేదని, అమరావతి రాజధాని అభివృద్ధికి తిరిగి ప్రాణం ఎక్కించేలా వ్యవస్థలను పునరుద్ధరించేందుకు రూ.లక్ష కోట్ల వ్యయంతో మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వం రూపొంది స్తోందన్నారు. రాజధానిలో పునర్నిర్మాణ పనులకు రూ.48 వేల కోట్ల వ్యయంతో ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. గతంలో టెండర్లను గృహాల పథకానికి మారుస్తూ మళ్ళీ కట్టించేందుకు రూ.44 వేల కోట్లు మంజూరు చేశారన్నారు.

రామ్మోహన్‌రావుకు ఘన సత్కారం

ప్రజాశక్తి-కిర్లంపూడి


రామ్మోహనరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

తామరాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో మ్యాథ్స్ ప్రొఫెసర్ ముమ్మిడి రామ్మోహన్ రావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట జనసేన పార్టీ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు లక్ష్మీ దంపతులను తుమ్మలపల్లి రమేష్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ రామ్మోహనరావు 36 ఏళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలలో సేవలందించి, ప్రొఫెషనల్ లైఫ్‌లోనే కాక పర్సనల్ లైఫ్‌లో కూడా ఎంతోమందికి తన వంతు సాయం చేసి మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. పూర్వ విద్యార్థుల ద్వారా తామరాడ పాఠశాలకు రూ.4 లక్షల విరాళాలు సేకరించి పాఠశాల అభివృద్ధికి దోహదపడ్డారని గుర్తు చేశారు. రిటైర్మెంట్ తర్వాత కూడా రామ్మోహన్ రావు గారి సేవలు విద్యార్థిలు ఉపయోగించుకోవాలని తుమ్మలపల్లి రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి గోకేడ రాజా, కాయల మణికంఠ, గోకేడ ప్రసాద్, కాయల శ్రీను, గోకేడ రమణ, సత్యంశెట్టి గణేష్, సుంకర రాజు, మాదారపు వీరబాబు, రాము ఇతరులు పాల్గొన్నారు.

పుల్లారెడ్డి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి గ్రామంలో మాజీ సొసైటీ ఉపాధ్యక్షుడు, జంగా పుల్లారెడ్డి ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం వారి కుమారుడు జంగా ప్రసాద్, మరియు కుటుంబ సభ్యులను మాజీ సొసైటీ అధ్యక్షుడు టిడిపి సీనియర్ నాయకులు పరిమి బాబు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరి వెంట సుంకవల్లి రమేష్, పి.సారంగబాబు ఉన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి- తాళ్లరేవు

మత విశ్వాసాలతో బాల్య వివాహాలు చేయొద్దని దానివల్ల పలు అనర్థాలు జరుగుతాయని ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇంజరం, సుంకరపాలెం, పిల్లంక, కోరంగి, తాళ్లరేవు ప్రాంతాల్లో చర్చిలు, దేవాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. సూపర్వైజర్లు నళిని, లలిత, నిభావని, రమణి మత పెద్దలకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ సిఎస్‌డబ్ల్యూ పిల్లి త్రిమూర్తులు, కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష్, కార్యదర్శి రమణ, టిడిపి నేతలు సాగి బాబ్జి రాజు పాల్గొన్నారు.

12న మాలల మహా రణభేరి

ప్రజాశక్తి - సామర్లకోట

ఎస్‌సి వర్గీకరణకు నిరసనగా మే 12న మాలల మహా రణభేరి, చలో కాకినాడ కార్యక్రమం చేపట్టనున్నట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు లింగం శివ ప్రసాద్, సీనియర్ నాయకులు నేతల హరిబాబు తెలిపారు. మాల మహానాడు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వి.రావు జయంతి సందర్భంగా కాకినాడలో మాలల మహా రణభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంభందించి కరపత్రికలు, పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం బలుసులపేట డాక్టర్ అంబేద్కర్ పార్కువద్ద చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీవల్లి పండు అశోక్, కండవెల్లి నాగరాజు, బొంగ సతీష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


గొల్లప్రోలులో పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా ముగిసిన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-గొల్లప్రోలు, పిఠాపురం

మండలంలోని చేబ్రోలు గ్రామంలో ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం పాలీసెట్ పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. 671 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 69 మంది విద్యార్థులు పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షకు హాజరయ్యారు. 62 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పరీక్ష జరిగినట్లు ఆదర్శ కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో ఏడు పరీక్ష కేంద్రాలలో నిర్వహించిన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 2343 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా వారిలో బాలురు 1256 మంది బాలికలు 898 మంది హాజరయ్యారు. 189మంది పరీక్షకు హాజరు కాలేదని కళాశాల ప్రిన్సిపాల్ మురళి తెలిపారు.


సర్టిఫికెట్లతో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు

వాలంటీర్లకు సర్టిఫికెట్ల ప్రదానం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ వాలం టీర్లకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర పాల్గొని మాట్లాడారు. ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా విద్యార్థులలో సేవా దృక్పథం, సమాజపట్ల బాధ్యతా భావం పెరుగుతుందని అన్నారు. విద్యార్థుల సేవా శక్తిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్ బి.మల్లికార్జున, భవానీ, సుభాషిణి, మురళీ, పవన్ పాల్గొన్నారు.


సత్తిబాబుతో మాట్లాడుతున్న జ్యోతుల

సత్తిబాబుకు ఎంఎల్‌ఎ పరామర్శ

ప్రజాశక్తి - గోకవరం

టిడిపి సీనియర్ నాయకులు, గోకవరం సొసైటీ అధ్యక్షులు ఘూజింగం సత్తిబాబును ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ బుధవారం పరామర్శించారు. ఇటీవల కంటికి శస్త్ర చికిత్స చేయించుకున్న సత్తిబాబు తన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ ఆయనను పరామర్శించి ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పరామర్శలో టిడిపి మండల అధ్యక్షులు మంగరౌతు రామకృష్ణ, గోకవరం గ్రామ అధ్యక్షులు పోసిన ప్రసాద్, భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్ ఛైర్మన్ గల్లా రాము, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి గునిపే భరత్ పాల్గొన్నారు.


ఉపకరనాలను అందజేస్తున్న ఎంఎల్‌ఎ

ఉపకరణాల అందజేత

ప్రజాశక్తి - బిక్కవోలు

మండలంలోని బలబద్రపురం గ్రామంలోని జడ్‌పి హైస్కూల్‌లో 36 మంది వికలాంగ విద్యార్థులకు ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా ఉపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలకు చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులకు సర్వ శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో భవిత సెంటర్స్ ద్వారా వికలాంగులకు ఉపకరణాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలకు చెందిన కూటమి పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని తీపర్రు, ముక్కామల, పెరవలి శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం మూడో రోజు కొనసాగాయి. రిసోర్స్‌పర్సన్స్ భార్గవి, ఎండి ప్రియాంక, ఎన్.పోసిబాబు పాల్గొని విద్యార్థు లచే కథలు వినిపించడం, కథలు చదివించడం, కథలు చెప్పించడం చేశారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో గ్రంథాలయ అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

నన్నయకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి - రాజానగరం


క్రీడాకారులను అభినందిస్తున్న విసి ప్రసన్నశ్రీ

ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ రోప్ స్కిప్పింగ్ పురుషుల విభాగ పోటీల్లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ క్రీడాకారులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సాధించారు. మహిళా విభాగంలో తృతీయ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. ఈ సందర్భంగా బుధవారం విశ్వవిద్యాలయంలో క్రీడాకా రులను విసి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అభినందించారు. ఈనెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రాజస్థాన్‌లోని పింద్వారా మాధవ్ విశ్వవిద్యాలయంలో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ రోప్ స్కిప్పింగ్ మెన్ అండ్ ఉమెన్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ అనుబంధ డిఎన్‌ఆర్ కళాశాల విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ దక్కించుకున్నారు. ఆల్ ఇండియా రూప్ స్కిప్పింగ్ మెన్ పోటీలలో పురుషుల విభాగంలో ఐదు పతకాలు, మహిళా విభాగంలో నాలుగు పతకాలు సాధించారన్నారు. చక్కని ప్రతిభ కనబరిచిన ఆర్.యేసు గోల్డ్ మరియు సిల్వర్, కె.వేణుసాయి రెండు సిల్వర్ పతకాలు, ఎం.లీలాగణేష్ ఒక సిల్వర్ పతకం సాధించారని తెలిపారు. మహిళా విభాగంలో జె.గాయత్రి, ఎం.నాగదేవి, సిహెచ్.సాయిలలిత, ఎస్‌ఆర్.గంగాభవాని ఒక్కో బంగారు పతకాన్ని సాధించారని తెలిపారు.

కిశోర బాలికలపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - తాళ్లపూడి, గోపాలపురం, దేవరపల్లి


గోపాలపురంలో మాట్లాడుతున్న సిడిపిఒ నాగలక్ష్మి

కిశోర బాలికల మానసిక ఎదుగుదల కోసం ఉపాధ్యాయులతో పాటు, తల్లి దండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పలువురు వక్తల అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోర వికాసం అనే కార్యక్రమంపై మండల స్థాయి శిక్షకులకు ఒకరోజు శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ వారానికి రెండుసార్లు కిశోర బాలికలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సమాజంలో కిశోర బాలికలు ప్రవర్తన, పాటించవలసిన నియమ నిబంధనలు, ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పిం చాలని అన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండేలా మరిన్ని జాగ్రత్తలను వివరించాలని సూచించారు. ఈ కార్య క్రమంలో ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ భారతి, ఎంఇఒ-2 నెహ్రూజీ, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు భాగ్యకుమారి, భానుమతి, ఎపిఎం మంగాయమ్మ పాల్గొన్నారు. అలాగే గోపాల పురం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో కిశోర వికాసంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిడిపిఒ కె.నాగలక్ష్మి మాట్లాడుతూ 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలలోపు కిశోర బాలికలకు మే నెల 2 తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు ప్రతి మంగళ, శుక్రవారం, గ్రామస్థాయిలో గ్రూపులు ఏర్పాటు చేసి, బాల్య వివాహాల నిర్మూలన, పోషకాహార లోపం, వివిధ రుగ్మతలపై, కెరియర్స్ గైడెన్స్, స్కిల్ డెవలప్‌మెంట్ అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు జెవి.వెంకటరమణ, కె.విజయకుమారి, ఎఎన్‌ఎం, సచివాలయ మహిళ పోలీస్, వివోలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే దేవరపల్లిలో కిశోర వికాసంపై బుధవారం శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఒ కె.నాగలక్ష్మి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సెక్టర్ సూపర్‌వైజర్ ఎం.శశికళ, ఎం.విజయలక్ష్మి, బి.. విజయశాంతి పాల్గొన్నారు.

ఎడి సుభాషిణి ఉద్యోగ విరమణ వేడుక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


ఎడి సుభాషిణి దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు

సమాచార శాఖ ఎడి కొత్తూరు సుభాషిణి పదవీ విరమణ వేడుక ఘనంగా జరిగింది. 1989 సంవత్సరంలో సమాచార శాఖలో చేరిన సుభాషిణి సుమారు 36 సంవత్సరాల పాటు సమాచార శాఖకు సేవలందించారు. వివిధ హోదాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించిన ఆమె బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా సహచర ఉద్యోగులు, సిబ్బంది అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి సిహెచ్.శ్రీనివాస్, సమాచార శాఖ లైబ్రేరియన్ యు.శేఖర్, సిబ్బంది కె.శాంత కుమారి, సిహెచ్ రామకృష్ణ, కె.స్వామిశేఖర్, పి.వెంకటేశ్వర రావు, జయరాజు,. బివి.రమణ, నాగిరెడ్డి, వర్మ, బుల్లియమ్మ, జానీ, దుర్గారావు, ప్రేమ్ చంద్, సుభాషిణి కుటుంబ సభ్యులు నన్నయ్య స్టాండింగ్ కమిటీ సభ్యులు గద్దె కోటినాగులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జ్ ఎడిగా లక్ష్మణాచార్యులు

రాష్ట్ర సమాచార కేంద్రం ఇన్‌ఛార్జ్ సహాయ సంచాలకులుగా డివిజనల్ పౌర సంబంధాల అధికారి ఎం.లక్ష్మణాచార్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

ఆర్యవైశ్యుల సంఘానికి అండగా ఉంటా : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - గోకవరం


పాలకవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న జ్యోతుల

ఆర్యవైశ్యుల సంఘానికి అండగా ఉంటానని ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. బుధవారం మండలం లోని కృష్ణునిపాలెంలో ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్లో జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా ఎంపికైన టిడిపి నాయకులు బత్తుల సత్తిబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ జ్యోతులతోపాటు, రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ, గుడా మాజీ ఛైర్మన్ గన్ని కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతుల మాట్లాడుతూ బత్తుల సత్తిబాబుని జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు ఎన్నుకోవడం శుభ పరిణామమని అన్నారు. ఆర్యవైశ్యులు సమైక్య భావంతో ముందుకు వెళుతుంటారని అన్నారు. అధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో ముందుండే ఆర్యవైశ్య సంఘీయులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంద న్నారు. గతం నుంచి టిడిపికి అనేక సేవలందించారని కొని యాడారు. ఈ సందర్భంగా బత్తుల సత్తిబాబు మాట్లాడుతూ నా సేవలను గుర్తించి, జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షుడుగా నియమించినందుకు సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్తిబాబుతోపాటు, జిల్లా కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు.


వివరాలు సేకరిస్తున్న తహశీల్దార్ మోహనభారతి

నివాస స్థలాల వివరాల సేకరణ

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న వారి వివరాలను సేకరిస్తున్నట్లు ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ మోహనభారతి తెలిపారు. బుధవారం మండలంలోని రాగోలపల్లి గ్రామంలో ప్రభుత్వ పోరంబోకు భూముల్లో నివాసాలు ఉంటున్న కుటుంబాల వివరాలను సేకరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొంత గృహాలు లేని కుటుంబాలు 2019 సంవత్సరాని కంటే ముందు నుంచి పోరంబోకు స్థలాల్లో నివాసం ఉంటే వారిని గుర్తించి క్రమబద్ధకరణ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గ్రామాల్లోని 25 కుటుంబాల నుంచి వివరాలు సేకరించినట్లు ఆమె తెలిపారు.


శిక్షణకు హాజరైన వివిధ శాఖల అధికారులు, ఎన్‌జిఒలు

లైంగిక దాడులు అరికట్టేలా చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

బాలికలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సైకాలజిస్ట్ దుర్గాప్రసాద్ సూచించారు. బుధవారం ఆనం కళా కేంద్రంలో జిల్లా విద్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ఎన్‌జిఒలకు పునచ్ఛరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, వాటిని ఏ విధంగా అరికట్టాలి అనే అంశంపై వివరించారు. పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు అందరిపైన ఉందని ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ హరిచంద్ర వివరించారు. ఈ కార్యక్రమంలో ఇమ్యూనైజషన్ అధికారి డాక్టర్ కోమల, డిఇఒ కె.వాసుదేవరావు, చిన్న పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ ఇంద్రజ, డైస్ మేనేజర్ సతీష్, డైస్ సిబ్బంది, వివిధ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.


పరీక్షా కేంద్రాన్ని పరీక్షిస్తున్న విసి ప్రసన్నశ్రీ

బిఇడి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన విసి

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న బిఇడి పరీక్షా కేంద్రాన్ని విసి ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో బిఇడి మూడవ సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 29వ తేదీ నుంచి జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో 169 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, మే 3వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

టిడిపి గ్రామ అధ్యక్షునిగా ఆనంద్

ప్రజాశక్తి - గోకవరం



గోకవరం గ్రామ టిడిపి అధ్యక్షులుగా మోటపర్తి ఆనంద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి గోకవరం గ్రామ అధ్యక్షులుగా నియమించిన ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ, టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

మాచవరంలో విషాదం

సింహాచలం ఘటనలో ఇద్దరు యువకుల మృతి

ప్రజాశక్తి - అంబాజీపేట

విశాఖ జిల్లా సింహాచలంలోని సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. స్వామి వారి నిజ రూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులపై గోడ కూలడంతో ఏడుగురు మృతి చెందారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. వీరిలో ఇద్దరు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జిల్లా అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన వారు ఉన్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సింహాచలంలో భారీ వర్షం కురిసింది. దీంతో సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.300 టికెట్ క్యూలైన్ వద్ద ఉన్న సిమెంట్ గోడ కూలిపోయింది. వెంటనే ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను విశాఖ కేజీహెచ్ కు తరలించారు. గాయపడిన వారిని స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

చందనోత్సవంలో జరిగిన ప్రమాదంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటం మడలం మాచవరం గ్రామం కొర్లపాటి వారిపాలేనికి చెందిన ఇద్దరు మృతి చెందారు. గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు, రైతు నాయకులు పత్తి దత్తుడు చిన్న కుమారుడు పత్తి దుర్గా స్వామినాయుడు(28) గోడ కూలిన ఘటనలో మృతి చెందాడు. స్వామినాయుడు విశాఖపట్నంలో ఇంటీరియల్ వర్క్స్ కంపెనీ పెట్టి వర్క్‌లు చేయిస్తుంటాడు. అలాగే ఇదే గ్రామానికి చెందిన కుంపట్ల మణికంఠ ఈశ్వరశేషారావు(26) ఈ ప్రమాదంలో మృతి చెందాడు. మణికంఠ విశాఖలోని ఓ ఫార్మా కంపెనీలో కుక్‌గా పనిచేస్తున్నారు. దైవ దర్శనానికి మృత్యువాత పడ్డాడు. ఆయన తండ్రి కుంపట్ల శ్రీను కూడా కుక్‌గా గ్రామంలో పనిచేస్తున్నాడు. మణికంఠ ఆయన పెద్ద కుమారుడు. వీరి మృతితో మాచవరంలో విషాదం అలముకుంది. చేతికందొచ్చిన కుమారులు దైవదర్శనానికి వెళ్లి మృత్యువాత పడటాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. గుండెలవిసేలా రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.


బాధితులను పరామర్శిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ, నాయకులు

మృతుల కుటుంబ సభ్యులకు ఎంఎల్ఎ పరామర్శ

అంబాజీపేట మండలం కొర్లపాటివారిపాలెం గ్రామానికి చెందిన పత్తి దత్తుడు, కుంపట్ల శ్రీను కుటుంబ సభ్యులను పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ బుధవారం పరామర్శించారు. ఈ విషాద ఘటనపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చేతికందొచ్చిన కొడుకులను కోల్పోయిన తల్లిదండ్రుల బాధ ఎవరు తీర్చలేనిదని, వారి కుటుంబాలకు అండగా ఉంటానని తెలిపారు మతుల కుటుంబాలకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహాయం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తొలగించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

నియోజవర్గం పరిధిలో దాల్వా రైతులను మిల్లర్లు అధికారులు నిబంధనల పేరుతో గురి చేస్తున్నారని ఇబ్బందులు తొలగించి మద్దతు ధర వచ్చేలా తమకు సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు రైతులు మొర పెట్టుకున్నారు. బుధవారం సాయంత్రం సామర్లకోట భీమేశ్వర ఆలయం సమీపంలో ధాన్యం మాసూలు చేస్తున్న తీరును జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. బ్యాంకు గ్యారంటీ లేవన్న పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని రోజుల తరబడి కల్లాలపై ధాన్యం ఉండిపోవడంతో, మరోవైపు వాతావరణం మారుతుందని చేతికి అందిన పంట నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు జెసికి మొరపెట్టుకున్నారు. సందర్భంగా రైతు సంఘం అధ్యక్షుడు కంటే జగదీష్‌మోహన్ మాట్లాడుతూ పెద్దాపురం నియోజవర్గంలో ఎక్కడ ఆసియాలోనే లేనివిధంగా రెండు అతిపెద్ద రైస్ మిల్లులు ఉన్నప్పటికీ వారు దాల్వాలో కనీసం రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. బుధవారం వరకూ ఒక్క ట్రాక్టర్ ధాన్యం కూడా కొనుగోలు చేయలేదని రైతులు జెసికి ఫిర్యాదు చేశారు. సిఎంఆర్ లేదంటూ రోజుల తరబడి రైతులు తరలించిన ధాన్యం ట్రాక్టర్లను మిల్లులు వద్దే నిలిపేస్తున్నారన్నారు. తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని కంటి బాబు తెలిపరు. పిల్లర్లు కొనుగోలు పేరుతో మంగళవారం 75 కిలోలు బస్తా రూ.1,650, బుధవారం రూ.1,600, నేడు రూ.1,550కు అడుగుతున్నారని, బస్తాకు వంద రూపాయలు పైబడి నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రెండు అతి పెద్ద రైస్ మిల్లులు లలిత ట్రేడర్స్, సైరస్‌లు ఉన్నప్పటికీ ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే ఆ రెండు మిల్లు ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్‌ను కోరారు.మద్దతు ధర మాట దేవుడెరుగు ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలు కారణంగా ఐదు శాతం ధాన్యం కొనుగోలు కూడా చేపట్టలేదన్నారు.


జెసి రాహుల్ మీనాకు సమస్యను వివరిస్తున్న కంటే బాబు, రైతులు

దాళ్వా ధాన్యం విక్రయాల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సత్వరమే మిల్లర్లతో చర్చించి పరిష్కరించ డానికి చర్యలు చేపడతారని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా హామీ ఇచ్చారు. ఈ నిజంగా లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం కొనుగోలు చేపడుతున్నట్లు చెప్పారు. 80 శాతం బొండాలు రకం కావడంతో ఇబ్బందులు ఉన్నట్లు చెప్పారు. సత్వరమే చర్చించి సమస్యలు పరిష్కరించాలని సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ ఎండి నాయక్‌ను జెసి ఆదేశించారు. అంతకు ముందు వ్యవసాయ శాఖ అధికారులతో జెసి కొనుగోళ్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ నాయక్, వ్యవసాయ శాఖ ఇన్‌ఛార్జి ఎడి ఎ.రత్నప్రశాంతి, తహశీల్దారు కె.చంద్రశేఖం రెడ్డి, ఎఇ సత్య, రైతు నాయకులు పి.శ్రీనివాసరావు, యార్లగడ్డ బాపినీడు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై కౌన్సిలర్ల నిలదీత

ప్రజాశక్తి-గొల్లప్రోలు

అభివృద్ధి పనులు, తాగునీరు, వీధిలైట్లు సమస్యలపై కౌన్సిల్ సభ్యులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు బుధవారం నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన కమిషనర్ ఎన్.కనకారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ గంధం నాగేశ్వరావు, కౌన్సిల్ సభ్యులు గంటా అప్పలస్వామి, మొగలి దొరబాబు సమస్యలను ప్రస్తావించారు. వైస్ చైర్ పర్సన్ తెడ్ల పలికే రాణి మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని అధికారులు పట్టినట్టుగా వ్యవహరిస్తున్నారని నిరదీశారు. ఎఇ ప్రభాకర్ మాట్లాడుతూ త్వరలోనే 150 వీధిలైట్లు కొత్తవి తెప్పిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, బెందుకుర్తి సత్తిబాబు, గుళ్ళ సుబ్బయ్య, ఇరుగుల యేసు, మేనేజర్ నవీన్, సానిటేషన్ ఇన్‌ఛార్జి రఘు తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక కౌన్సిల్ సమావేశం వాయిదా



ప్రజాశక్తి - సామర్లకోట

వైసిపి మున్సిపల్ కౌన్సిలర్లు భారీ సంఖ్యలో హాజరు కాని కారణంగా కోరం లేకపోవడంతో సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం వాయిదా పడింది. బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహణకు ఏర్పాటు చేశారు. సమావేశానికి టిడిపి కౌన్సిలర్లు బలుసు వాసు, గొర్రెల జయలక్ష్మి, వైసిపికి రాజీనామా చేసినకౌన్సిలర్ పిల్లాడి సత్యవతి, వైసిపి కౌన్సిలర్లు చల్లా సత్యనారాయణ, కాళ్ళ శ్యామల ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం సరిపోకపోవడంతో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ప్రకటించారు. సమావేశం ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని చెప్పారు.

అవిశ్వాస తీర్మానం ఎదుర్కోవడానికి సిద్ధం

రెండు నెలలుగా తనపై తెలుగుదేశం పార్టీ ముద్ర వేసి కౌన్సిల్ సమావేశం కోరం లేకుండా వాయిదా పడేలా చేశారని, నాలుగేళ్లుగా తాను వైసిపి నాయకులు చెప్పినట్లుగా విన్నానని, ప్రస్తుతం నోరు విప్పడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా అనంతరం స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ ఛాంబర్‌లో ఆమె తన భర్త గంగిరెడ్డి కృష్ణమూర్తితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాను ప్రోటోకాల్ ప్రకారం ఎంఎల్ఎ కార్యక్రమాల్లో పాల్గొంటే టిడిపిలో చేరిపోయినట్లు వైసిపి నాయకులు ప్రచారం చేశారన్నారు. జిల్లా కలెక్టర్‌కు రెండు నెలలుగా అవిశ్వాసంపై లేఖలు ఇస్తున్నారని, అవిశ్వాస తీర్మానం ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలోకాటూరి జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన చేస్తున్న న్యాయవాదులు

ఉగ్రదాడిపై కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గావ్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ బుధవారం రాజమహేంద్రవరం జిల్లా కోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు శోభనాద్రి, సెక్రటరీ రమేష్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రవాదానికి వ్యాతిరేకంగా నినదించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉగ్రదాడి నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.


లైట్లు ఆర్పేయడంతో అంధకారంలో ఇస్లాంపేట

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా
లైట్లు ఆర్పేసి నిరసన

ప్రజాశక్తి-చాగల్లు

వక్స్ సవరణ బిల్లుకి వ్యతిరేకంగా ఆలిండియా ముస్లిం పర్సనల్ బోర్డు ఇచ్చిన దేశవ్యాప్త పిలుపు మేరకు బుధవారం రాత్రి 9 గంటల నుంచి 9.15 గంటల వరకూ ముస్లిములు తమ ఇళ్లలో లైట్లన్నీ ఆర్పేసి నిరసన తెలిపారు. చాగల్లు ఇస్లాం పేటలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు ముస్లిం కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్దార్ పాషా, అల్తాఫ్ జానీ, గౌస్ బెగ్, అల్తాఫ్, అహ్మద్ అలీబేగ్, తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందజేత

ప్రజాశక్తి -కరప

కరప గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతుండగా కాకినాడ రోటరీ క్లబ్ ఆధ్వర్యాన ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందజేసినట్లు మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఒక ప్రకటనతో తెలిపారు. మెరక వీధికి చెందిన నర్ల సూరిబాబు (ఆలీ) ఊపిరితిత్తుల వ్యాధితో బాధ పడుతూ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్యం చేయించుకుని డిశ్చార్జ్ అయ్యారు. ఆయనకు ఇంటి దగ్గర నిత్యం ఆక్సిజన్ కాన్సంట్రేటర్ పెట్టుకుని ఉండాలని డాక్టర్ సూచించారు. దీంతో కాకినాడ రోటరీ క్లబ్ అరిగేల వెంకటేశ్వరావు(బాబీ), పోలిశెట్టి ఈశ్వరరావు దృష్టికి తీసుకుని వెళ్లగా వెంటనే వారు స్పందించి రూ.85 వేల విలువైన ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందజేశారు.

అధ్వానంగా పారిశుధ్యం

ప్రజాశక్తి-పిఠాపురం

మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డుల్లో ఎక్కడ చూసిన శానిటేషన్ నిర్వహణ అధ్వానంగా ఉందని కనీసం డ్రైన్లు కూడా శుభ్రం చేయకపోతే ఎలా అంటూ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం వైస్ చైర్మన్ పచ్చిమళ్ల జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. పట్టణంలో 30 వార్డులలో శానిటేషన్ అధ్వానంగా ఉందని కనీసం కాలువలు కూడా శుభ్రం చేయకుండా ఉండడంతో వార్డులు కంపు కొడుతు సానిటరీ నిర్వహణ అధ్వానంగా ఉందని 81 మంది శానిటేషన్ సిబ్బంది ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో శానిటేషన్ నిర్వహణ చెయ్యకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే ఉందని మున్సిపల్ అధికారులపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.



లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా రాజమహేంద్రవరం శ్యామలా సెంటర్‌లో నిరసన తెలుపుతున్న కేంద్ర కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, ఉద్యోగులు

ప్రజాశక్తి

మేడే ప్రత్యేక అనుబంధం



8 పేజీలు | ఉమ్మడి తూర్పు గోదావరి | గురువారం 1-5-2025

లేబర్ కోడ్‌ల అమలు..

మోడీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్ లను పార్లమెంట్‌లో నాలుగేళ్ల క్రితమే ఎటువంటి చర్చ జరపకుండా ఆమోదం పొందారు. కార్మికుల నిరసనకు తలొగ్గి వాటి అమలుకు ఇప్పటిదాకా నోటిఫై చేయలేదు. సార్వత్రిక సమ్మెతో కూడిన దేశ వ్యాప్త ఐక్య పోరాటాలు వీటి అమలును తీవ్రంగా వ్యతిరేకించి అడ్డుకున్నాయి.



కార్మికవర్గం ప్రతిఘటన

తన సొంత బలం తగ్గినా టిడిపి, జెడియు వంటి పార్టీల మద్దతుతో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ఎన్.డి.ఎ కార్పొరేట్ల అనుకూల నయా ఉదారవాద ఎజెండాను పూర్తి చెయ్యదలుచుకుంది. లేబర్ కోడ్‌ల అమలుకు గట్టి ప్రయత్నాలు ప్రారంభించింది.

లేబర్ కోడ్‌ల్లో ప్రస్తుతం ఉన్నది ఉన్నట్లుగా అమలు చేయడాన్ని, దేశంలో ఉన్న కార్మిక వర్గం అడ్డుకుంటుందనే హెచ్చరికను మోడీ ప్రభుత్వానికి, కార్పొరేట్లకు కూడా చేయాల్సి ఉంది. కార్మికవర్గ ఐక్య వేదిక పిలుపుమేరకు లేబర్ కోడ్‌ల అమలు ప్రారంభించిన వెంటనే దేశవ్యాప్తంగా అన్ని ప్రదేశాలలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించాలి. దీనికి కొనసాగింపుగా సార్వత్రిక సమ్మెకు సిద్ధం కావాలి. మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు రైతు చట్టాలకు వ్యతిరేకంగా పోరాడి రద్దు చేయించు కోగలిగిన సంయుక్త కిసాన్ మోర్చా, లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికోద్యమం చేస్తున్న పోరాటాలకు తమ పూర్తి మద్దతుని తెలియజేసింది. ఏళ్ల తరబడి పోరాటాలతో సాధించుకున్న హక్కులను హరించి, ఈ రకంగా కార్పొరేట్లకు అనుకూలంగా మోడీ ప్రభుత్వం తన విధానాలు తీసుకువస్తే, సంపద సృష్టికర్తలైన శ్రమజీవులు ఐక్యంగా వాటిని ఎదుర్కొంటామని తెలియచెప్పాలి. లేబర్ కోడ్‌ల అమలు ఆపటానికి మరో దశ పోరాటానికి సన్నద్ధం చేయాల్సి ఉంది.

లేబర్ కోడ్ లను ఎందుకు వ్యతిరేకించాలి?

ప్రస్తుతం ఉన్న 29 కార్మిక చట్టాలను కుదించి, కార్మిక సంస్కరణల పేరిట నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించడం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం ఆ చట్టాల్లో కార్మికుల రక్షణకై ఉన్న కొద్దిపాటి అంశాలను కూడా తొలగించడమే. ప్రస్తుతం ఉన్న కార్మిక చట్టాలు సుదీర్ఘ పోరాటాల వల్ల సాధించుకున్నవి. అనేక లోపాలు వాటిలో ఉన్నా పని ప్రదేశంలో హక్కులు, వేతనాలు, సామాజిక భద్రత, ఆరోగ్యం, రక్షణ, సంక్షేమం వంటి అంశాల ద్వారా ఎంతో కొంత రక్షణ కల్పిస్తున్నాయి. వీటన్నింటినీ తొలగించి యాజమాన్యాలకు మేలు చేయడమే ఈ లేబర్ కోడ్‌ల ఉద్దేశం.



సార్వత్రికత పేరుతో తెస్తున్న ఈ లేబర్ కోడ్‌లు అసంఘటిత రంగాన్నే కాకుండా, సంఘటిత రంగంలో ఉన్న అత్యధిక కార్మికులను సైతం ఈ కార్మిక చట్టాలకు దూరం చేస్తుంది. కోడ్‌లలో నిర్వచనాలు అత్యధిక కార్మికులను దూరం చేసేందుకు ఉద్దేశపూర్వకంగా మలచబడ్డాయి. ఉదాహరణకు 'ఆక్యుపేషనల్ హెల్త్, సేఫ్టీ అండ్ వర్కింగ్ కండిషన్స్' (ఒహెచ్ఎస్‌డబ్ల్యుసి) అనేకోడ్‌లో ఉద్యోగి, కార్మికుడు అనే పదాలను ఒకదాని స్థానంలో ఒకటి వాడారు. ఉద్యోగి అనే పదాన్ని ఎక్కువసార్లు వాడడం ద్వారా యాజమాన్యాలు వక్రీకరించి కార్మికుల ఎడల వివక్ష చూపి ఈ కోడ్‌లోని అంశాల అమలుకు కార్మికులనుదూరంగా ఉంచే ప్రమాదం ఎంతైనా ఉంది. ఏళ్ల తరబడి పరిశ్రమల్లో అప్రెంటిస్, ట్రైనీల పేరిట పనిచేస్తున్న వారు ఈ నిర్వచనాల్లో లేరు. ఉద్యోగి, కార్మికుడు పదాల నిర్వచనాల నుండి కాంట్రాక్ట్ కార్మికులు మినహాయించబడ్డారు. 'పారిశ్రామిక సంబంధాలు' అనే కోడ్‌లో సూపర్వైజర్లు, మేనేజర్లు అనే పదాలు వాడడం ద్వారా ఉద్యోగ కార్మికుల్లో అత్యధిక భాగం ఈ కోడ్ అమలు నుండి మినహాయించబడతారు. ఆ సూపర్వైజరీ హోదాలో రూ.18 వేలు వేతనం దాటిన తర్వాత వారు ఉద్యోగి/కార్మికుడు అనే నిర్వచనంలోకి రారు. అలాగే ఎస్టాబ్లిష్మెంట్ అనే నిర్వచనం కింద పది మందిలోపు కార్మికులు పని చేసే సంస్థలు కోడ్ పరిధిలోకి రావు. ఫ్యాక్టరీ నిర్వచనం కింద విద్యుత్ వినియోగించే సంస్థల్లో 20మందిలోపు కార్మికులు ఉన్నవి, విద్యుత్ 2లో..

విజయపథంలో పేపరు మిల్లు కార్మికుల పోరాటం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

నాలుగు సంవత్సరాలుగా వేతన ఒప్పందం కోసం ఎపి పేపరు మిల్లు కార్మికులు సుదీర్ఘ పోరాటం చేస్తున్నారు. 2019లో చివరి సారిగా వేతన ఒప్పందం జరిగింది. అప్పటి గుర్తింపు సంఘం నాయకుడు, యాజమాన్యం కుమ్మక్కై కార్మికుల చట్టబద్ధమైన ప్రజాస్వామ్య హక్కులను కాలరాశారు. పర్మినెంట్ కార్మికులకు వేతన ఒప్పందం లేకుండా చేశారు. కాంట్రాక్టు కార్మికులు చాలీ చాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలపై కార్మిక సంఘాలన్నీ ఏకమై యాజమాన్యానికి వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించాయి. 2024 ఏప్రిల్‌లో 22 రోజులు నిరవధిక సమ్మె చేపట్టాయి. అప్పటి వరకు జులై 2020 నుంచి డిసెంబరు 2023 వరకూ జరగాల్సిన వేతన ఒప్పందం చేయబోమని చెప్పిన యాజమాన్యం ఈ సమ్మె ఫలితంగా దిగొచ్చింది. ఆ కాలానికి సంబంధించిన వేతన ఒప్పందం చేయడానికి రాతపూర్వకంగా అంగీకరించింది. 22 రోజుల సమ్మె అనంతరం ఎటువంటి క్రమశిక్షణా చర్యలు లేకుండా విధులకు కార్మికులు తిరిగి హాజరయ్యారు. అదే సమయంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనేక ఒత్తిడులు వచ్చినా 22 రోజులు సమ్మె చేపట్టడం చారిత్రాత్మకం.



యాజమాన్యం నిరంకుశ వైఖరిపై అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న కార్మికులు

ఇప్పటికీ యాజమాన్యం ఒప్పందం చర్చల పేరుతో కాలయాపన చేస్తూ వస్తోంది. అయినా కార్మిక వర్గం పట్టువదలకుండా ఐక్యంగా పోరాడుతోంది. రెండేళ్లకోసారి ప్రజాస్వామ్యయుతంగా జరగాల్సిన గుర్తింపు ఎన్నికలు నిర్వహించకుండా కోర్టులో కేసులు వేస్తూ 2020 నుంచి యాజమాన్యం అడుకుంటూ వచ్చింది. ఐదేళ్ల సుదీర్ఘ పోరాటం ఫలితంగా 2025 ఏప్రిల్‌లో ఎట్టకేలకు ఎన్నికలు నిర్వహించడానికి యాజమాన్యం సుముఖత వ్యక్తం చేసింది. కోవిడ్ సమయంలో సీనియారిటీ ప్రకారం కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాల్సిన స్థానంలో పరంపర పేరుతో ఉద్యోగాలు అమ్మకాలు చేశారు. ఉద్యోగాలు కొనుక్కుని వచ్చిన పరంపర కార్మికులకు వేతన ఒప్పందం విషయంలో అసమానతలు పెట్టి నష్టం చేశారు. చివరికి అదే పరంపర కార్మికులు తాము నగదు ఇచ్చి మోసపోయామని 90 రోజుల సమ్మె చేసి యాజమాన్యంపై పోలీసు కేసు నమోదు చేశారు. ఈ పరిణామం ఆనాడు పరంపర పేరుతో పోస్టులు అమ్మకాలు జరిగాయంటూ ఆనాడు కార్మిక వర్గం చేసిన పోరాటం సరైందని తాజాగా రుజువైంది. మరోవైపు కాంట్రాక్టు కార్మికులు కేవలం కనీస వేతనంతోనే బతుకీడ్చాల్సిన పరిస్థితి నెలకొంది. పర్మినెంట్ జాగాల్లో పనిచేస్తున్నా వారికి పర్మినెంట్ వర్కర్‌తో సమానమైన వేతనమూ లేదు, పర్మినెంటూ లేదు. ఈ మొత్తం పోరాటాలు అన్ని కార్మిక సంఘాలను ఐక్యం చేసి యాజమాన్యానికి వ్యతిరేకంగా పోరాటం చేయడంలో సిఐటియు కీలకపాత్ర పోషించింది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన దుర్మార్గమైన లేబర్ కోడ్ సారాంశాన్ని పేపరు మిల్లు యాజమాన్యం ముందుగానే అమలుకు పూనుకుంది. వీటన్నింటిపైనా కార్మిక వర్గం భవిష్యత్తులో ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉంది.

పోరుబాటలో ఓఎన్‌జిసి కార్మికులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

భారత దేశంలో ప్రభుత్వ రంగ మహారత్న సంస్థల్లో ఓఎన్‌జిసి ఒకటి. అటువంటి ఓఎన్‌జిసి కేజీ బేసిన్‌లో ఉత్పత్తి కార్యకలాపాల్లో ఫీల్డ్ ఆపరేటర్ కార్మికులు పనిచేస్తున్నారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్నా వీరికి సమాన వేతనం, వైద్య సదుపాయాలు లేకపోవడంతో నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. 2011లో వేతన ఒప్పందం జరిగిన తరువాత 2015 నుంచి 19 వరకూ జరగాల్సిన వేతన ఒప్పందం అప్పటి గుర్తింపు సంఘమైన పిఇయు యాజమాన్యంతో కుమ్మక్కు అవడంతో వేతన ఒప్పందం జరగలేదు. 2019-2023 వేతన ఒప్పందం ఆలస్యం కావడంతో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్నారు. ప్రస్తుతం 2023 నుంచి జరగాల్సిన వేతన ఒప్పందం ఆలస్యమవడంతో కేజీ బేసిన్‌లోని ఫీల్డ్ ఆపరేటర్‌ల జెఎసి సిఐటియు నాయకత్వంలో నాలుగు నెలలుగా నిరసనలు, ధర్నాలు, క్యాంటీన్ బాయ్‌కాట్‌లు వంటి వివిధ రూపాలలో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. అయితే ఇక్కడ కూడా పిఇయు యాజమాన్యంతో కుమ్మక్కు అవటంతో వేతన ఒప్పందం పెరగాల్సిన స్థాయిలో పెరగలేదు. ఏమైనా కార్మికవర్గం పోరాడి ఆ మాత్రమైనా సాధించుకోగలిగారు. ఇదే కేజీ బేసిన్‌లో కాంట్రాక్టు డ్రైవర్లుగా 400 మంది కార్మికులకు కనీస వేతనాలు, ఓఎన్‌జిసి ప్రకటించిన ఫెయిర్ వేజ్ పాలసీలు చెల్లించకుండా కాంట్రాక్టర్లు, గుర్తింపు సంఘం ప్రతినిధులు దోచుకుంటున్నారు. 2024 సెప్టెంబరులో కాంట్రాక్టు డ్రైవర్లందరూ గుర్తింపు సంఘానికి రాజీనామా చేసి సిఐటియులో చేరారు. అప్పటి నుంచి సిఐటియు ఆధ్వర్యంలో సమస్యలపై పోరాడుతున్నారు. కేజీ బేసిన్ గేటు ఎదుట రెండు సార్లు ధర్నాలు చేపట్టారు. తాము అన్నీ చెల్లిస్తున్నామని చెప్పుకొచ్చిన కాంట్రాక్టర్ల వైఖరి తప్పని కార్మికశాఖ అధికారుల ఎదుటే నిరూపించి, వారి దోపిడీ బండారాన్ని సిఐటియు బట్టబయలు చేసింది. ఫీల్డ్ ఆపరేటర్లు, కాంట్రాక్టు వర్కర్ల సమస్యలపైనా నిజాయతీగా పోరాడుతున్న సిఐటియు పట్ల యాజమాన్యం అక్కసుతో సిఐటియు నాయకులకు మెమోలిచ్చి బెదిరింపులకు పాల్పడింది. అయినా బెదిరింపులను లెక్క చేయకుండా సిఐటియు నాయకులు పోరాటాలను కొనసాగిస్తున్నారు. ఇక్కడ కూడా ప్రజాస్వామ్యయుతంగా జరపాల్సిన ఎన్నికలను నిర్వహించకుండా యాజమాన్యం, గుర్తింపు సంఘమైన పిఇయు అడ్డుకుంటున్నాయి. గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు పోరాటాన్ని కొనసాగిస్తోంది.

సమ్మెను విజయవంతం చేయాలి



కేంద్ర కార్మిక సంఘాల పిలుపు నేపథ్యంలో ఈ నెల 20న జరగబోయే దేశవ్యాప్త సమ్మెను కార్మికులంతా ఐక్యమై విజయవంతం చేయాలి. దేశంలో కార్మిక సంఘాలు నిర్వహించిన అనేక పోరాటాల ఫలితంగా కార్మిక చట్టాలు ఏర్పడ్డాయి. అటువంటి కార్మిక చట్టాలకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తూట్లు పొడిచింది. కార్మిక చట్టాల స్థానంలో రూపొందించిన 4 లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి. సమాన పనికి సమాన వేతనం, కాంట్రాక్టు కార్మికులు పర్మినెంటు వంటి సమస్యలపై కార్మికులు రాబోయే రోజుల్లో హక్కుల కోసం సమరశీల పోరాటాలను నిర్వహించాల్సిన అవసరం ఉంది.

- టి. అరుణ్ ,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు

లేబర్ కోడ్‌ల అమలు...కార్మికుల ప్రతిఘటన

(మొదటి పేజీ తరువాయి)

వినియోగించని సంస్థల్లో 40 మందిలోపు కార్మికులు ఉన్నవి మినహాయించబడ్డాయి. ఒ.హెచ్.ఎస్.డబ్ల్యు.సి. కోడ్ నుండి 5 హెక్టార్లలోపు ఉన్న ప్లాంటేషన్స్‌కు మినహాయింపు ఇచ్చారు.

కోడ్ అమలు చేయాల్సిన కార్మిక పరిమితులను ఎంతవరకు సడలించారంటే వాటి సాకు చూపించి యాజమాన్యాలు తప్పించుకోవచ్చు.

ఉదాహరణకు...

- 500 లోపు కార్మికులు పనిచేస్తున్న ఫ్యాక్టరీ లేదా భవన, ఇతర నిర్మాణాల పనుల్లో సేఫ్టీ ఆఫీసర్ అవసరం లేదు.
- 250 మంది లోపు కార్మికులుంటే సంక్షేమ అధికారి అక్కర్లేదు.
- వందమంది లోపు కార్మికులుంటే క్యాంటీన్ సదుపాయం కల్పించనవసరం లేదు.
- 50 మంది లోపు మహిళా కార్మికులు ఉంటే క్రచ్ సదుపాయం కల్పించనవసరం లేదు.
- 50 మంది లోపు కార్మికులుంటే లంచ్ రూము, రెస్ట్ రూము ఇవ్వనవసరం లేదు.
- 500 మంది లోపు కార్మికులుంటే అంబులెన్స్ సౌకర్యం కూడా అక్కరలేదు.

కుదించడం, హేతుబద్ధం చేయడం పేరిట వేతనాలు, బోనస్‌కు చెందిన చట్టాలను వేతనాల కోడ్‌గా మార్చారు. కొన్ని అంశాలను దానిలో పొందుపరచడం ద్వారా, ప్రస్తుతం ఉన్నవి తొలగించడం లేదా బలహీనపరచడం ద్వారా యాజమాన్యాలకు మేలు చేసేట్లు తెచ్చారు. కనీస వేతనం నిర్దేశించడంపై 1957లో 15వ కార్మిక సమాఖ్య మార్గ నిర్దేశికాలు, 1992లో సుప్రీంకోర్టు 'రాప్టకోస్ అండ్ బ్రెట్' కేసులో ఇచ్చిన తీర్పు, 44, 45, 46 ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌లలో, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ లేబర్ ఇచ్చిన రికమండేషన్ పదేపదే చెబుతున్న అంశాలు పొందుపరచలేదు. కార్మిక సంఘాలు అవిశ్రాంతంగా జరిపిన పోరాటంతో అయిష్టంగానే డ్రాఫ్ట్‌లో చేర్చారు. మూల వేతనం, కరువు భత్యం, ఇతర అలవెన్స్ మాత్రమే అంటూ వేతనం నిర్వచనాన్ని కుదించారు. దీనిలో సార్వజనీనత ఎక్కడుంది? సార్వజనీనత కోసం తెచ్చామనటం నయవంచన తప్ప ఇంకోటి కానే కాదు.

రంగాల వారీ సంబంధించిన చట్టాలను పరిశీలిస్తే నిర్మాణరంగం,బీడీ సిగరెట్లు, మైన్‌లు, పోర్ట్‌లు, వర్కింగ్ జర్నలిస్టులు, సేల్స్‌ప్రమోషన్ ఎంప్లాయీస్, రవాణా రంగ కార్మికులు వంటి వారికి సంబంధించిన పని పద్ధతులు, యాజమాన్య సంబంధాలు, ఆయా రంగాల్లో పనులు చేసే విధానం, ఉండే సమస్యలు, భద్రత అంశాలు వంటి ప్రత్యేకతలను బట్టి ఉన్న చట్టాలను రద్దు చేశారు. వీటన్నిటికీ చెందిన ఓ.ఎస్.హెచ్.డబ్ల్యు.సి. కోడ్ అన్ని రంగాలకు చెందిన పని పద్ధతులకు 'ఒకే మోడల్ ఫిట్' అవుతుంది అన్నట్టుగా రూపొందించారు. ఈ రకంగా కార్మికులు ప్రధానంగా వలస కార్మికులు, కాంట్రాక్టు వర్కర్లు యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు, ఈ ప్రభుత్వ చర్యల వల్ల నెట్టివేయబడ్డారు.

సామాజిక భద్రత కోడ్‌లో బీడీ, ముడి ఇనుము మైన్‌లు, మైకామైన్‌లు, లైమ్ స్టోన్ మైన్‌లు, డోలమైట్ మైన్‌ల వంటి పరిశ్రమల్లో పనిచేసే అత్యధిక కార్మికులకు ప్రస్తుతం చట్ట ప్రకారం అమలవుతున్న సాంఘిక భద్రతా హక్కులు, సదుపాయాలు సందిగ్ధంలో పడ్డాయి. దీనికి కారణం ఈ రంగాల్లో సెస్ వసూలు కున్న అవకాశాలను రద్దు చేశారు. సాంఘిక భద్రతా కోడ్ వీరెవరికీ సామాజిక భద్రతా ప్రయోజనం కల్పించడం లేదు. ప్రభుత్వం ఎటువంటి బడ్జెట్ కేటాయించకపోవటంతో అసంఘటిత కార్మికులు కనీస సామాజిక భద్రతకు నోచుకోని దుర్భర పరిస్థితుల్లోకి వెళ్తారు.

ఇ.పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ. వంటి సాంఘిక భద్రతా పథకాలను క్రమబద్ధీకరణ చేస్తున్నామనే పేరిట, ఈ సామాజిక భద్రతా కోడ్‌లో యాజమాన్య వర్గాలకు ప్రయోజనం కలిగించేట్లు యాజమాన్యాలు చెల్లించే వాటా శాతం తగ్గించటం, ఇ.పి.ఎఫ్. స్కీం నుండి సంస్థలకు మినహాయింపు ఇవ్వడం, ప్రస్తుతం ఇ.పి.ఎఫ్. అమలు చేసే సంస్థలు కూడా ఆ బాధ్యత నుండి తప్పుకునే అవకాశం కల్పించడం, ఇటువంటి నిర్ణయాలపై కేంద్ర ప్రభుత్వాన్ని బలోపేతం చేసేట్లు అంశాలున్నాయి.

కార్మిక సంఘాలన్నీ ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్న గ్రాట్యూటీపై ఎలాంటి సీలింగ్ లేకుండా, అర్హతను బట్టి లెక్క కట్టాలనే అంశాన్ని పెడచెవిన పెట్టారు. సామాజిక భద్రతా కోడ్ లోనూ అలాగే ఉంది.

పనిగంటలు..

ఒ.ఎస్.హెచ్.డబ్ల్యు.సి. కోడ్ ఎనిమిది గంటల పనిపై విముఖత చూపుతూ, అమలు చేయని వారికి శిక్షలో మినహాయింపు సైతం ఇచ్చింది. 8 గంటల పని విధానం మార్చుకునే అవకాశం యాజమాన్యాలకు, ఆయా ప్రభుత్వాలకు కల్పించింది. ఈ కోడ్‌లో కుదించబడ్డ 13 కార్మిక చట్టాలు పని పద్ధతులపై ప్రస్తావిస్తూ పనిగంటలను నిర్దేశించాయి. ఫ్యాక్టరీ చట్టంలోను, సంబంధిత చట్టాల్లోను రోజువారీ పని గంటలు, వారంలో పని గంటలు, పని సమయం, విశ్రాంతి సమయం, ఓవర్ టైం డ్యూటీ, పని గంటల సర్దుబాటు వంటి అంశాలను వివరించారు. కార్మికుల న్యాయపరమైన వివాదాలప్పుడు ఇవి చర్చకు వచ్చేవి. ఈ కోడ్ వీటన్నిటిని తొలగించి ఆయా రాష్ట్ర ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలకు కార్మికులను వదిలివేసింది. కర్ణాటక రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం పనిగంటలు 8 నుండి 12కు పెంచుతూ ప్రతిపాదిస్తే దాని తర్వాత అధికారానికి వచ్చిన కాంగ్రెస్ దీన్ని నోటిఫై చేసింది. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం 12 గంటల పని విధానంపై తెచ్చిన నోటిఫికేషన్‌ను కార్మిక సంఘాలు, భాగస్వామ్య పక్షాల నుండి వచ్చిన వత్తిడి మేరకు ఉపసంహరించుకుంది. వీటిని పరిశీలిస్తే కార్మికుల సంక్షేమం కన్నా కార్పొరేట్లను 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పేరిట ఆకట్టుకోవడమే ఆ ప్రభుత్వాల విధానంగా కనబడుతోంది. లేబర్ కోడ్‌లు ఆమోదించి నోటిఫై చేయడానికి ముందే ఈ చర్యలు ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయంగా ఆయా దేశాలు అమలు చేసిన ఎనిమిది గంటల పని విధానాన్ని మరోసారి చర్చకు పెట్టి ఆయా ప్రభుత్వాలు సమీక్షించడానికి పూనుకుంటున్నాయి. కార్పొరేట్ దిగ్గజాలైన నారాయణమూర్తి, సుబ్రహ్మణ్యం లాంటి వారు వారానికి 70 గంటల పని, 90 గంటల పని అంటూ డిమాండ్ చేయడం కార్మికుల శ్రమశక్తిని మరింత దోచుకుని వారి లాభాలు పెంచుకోవడానికే.

పారిశ్రామిక సంబంధాల కోడ్ కింద కుదించబడ్డ పారిశ్రామిక వివాదాల చట్టం ప్రస్తుతం సంఘానికి ఉన్న ప్రాథమిక హక్కులైన సమ్మె చేసే హక్కు, వివాదాలు పరిష్కరించుకునే హక్కు లాంటి వాటిని పూర్తిగా తీసివేసింది. సులభతరం చేయటం పేరు మీద ఉపాధి సంబంధాలపై ప్రభావం చూపే తాత్కాలిక సులభమైన సంబంధాలు ఉండేట్లు ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్మెంట్, కాంట్రాక్ట్ వర్కర్స్‌ను తెస్తున్నారు. ఈ తాత్కాలిక సంబంధాల వలన కార్మికులు తమంతట తాముగా సమీకరించబడలేకపోతున్నారు. కార్మికులు సమీకరించబడే వారి హక్కులను అడగనంత కాలం అవి కాగితాలకే పరిమితం అవుతాయి. వీటిని యాజమాన్యాలు ఉల్లంఘించ వచ్చు, శిక్షల నుండి మినహాయింపు పొందవచ్చు, ఎలాంటి భయం లేకుండా కార్మికులను యధేచ్ఛగా దోపిడీ చేయనూవచ్చు.

ఐ.ఆర్. కోడ్ యాజమాన్యాలకు హైర్ & ఫైర్ విధానం అమలు చేసే హక్కు, పని ప్రదేశంలో కార్మిక సంఘం లేకుండా ఉండేట్లు అవకాశం కల్పిస్తోంది. 'యూనియన్‌లు ఉండవు' అనే పాలసీ ఉన్న అమెజాన్, సాంసంగ్ వంటి బడా కార్పొరేట్లను శాంతింప చేయడానికే ఈ చర్యలు. మోడీ నాయకత్వంలో ఉన్న ప్రభుత్వం నయా ఉదారవాదం ఈ కేంద్ర ఉద్దేశానికి కట్టుబడి ఉంది.

పర్యవేక్షణ..

ఏ చట్టమైనా ఎప్పుడు ఉపయుక్తకరం అవుతుందంటే దాని అమలుకు సరైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసినప్పుడే. కార్మిక చట్టాల విషయంలో ఇది పూర్తి సత్యం. తరచుగా తనిఖీ చేయటం ఫిర్యాదు వచ్చినప్పుడు వ్యక్తిగతంగా తనిఖీలు నిర్వహించటం వంటి యంత్రాంగాలు ఉండాలి. లేబర్ కోడ్‌లలో కార్మిక శాఖ తనిఖీ అనేదే లేదు. ఇన్స్పెక్టర్ పేరు ఇన్స్పెక్టర్, ఫెసిలిటేటర్‌గా మార్చారు. వీరు వెబ్ ఆధారిత తనిఖీ చేయాలి. అది కూడా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పేర్కొన్నట్లు. అంటే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అనుకూలంగా చేయడం తప్ప చట్టాలు సక్రమంగా అమలు అవుతున్నాయో లేదో చూడటం కోసం కాదు. ఇది ఐ.ఎల్.ఓ. 81వ కార్మిక తనిఖీ సదస్సు తీర్మానాన్ని ఉల్లంఘించడమే. 'పని ప్రదేశాన్ని తరచుగా తనిఖీ చేసి కార్మిక చట్టాలు సక్రమంగా అమలు అవుతున్నాయో లేదో విధిగా చూడాలి' అనేది ఐ.ఎల్.ఓ. సభ్య దేశాలన్నీ తప్పక పాటించాలనేది కూడా ఉల్లంఘించటమే. రాబోయే రోజుల్లో ఫిర్యాదును బట్టి కార్మిక శాఖ తనిఖీలు ఉండవు. ఆకస్మిక తనిఖీలు ఉండవు. పని ప్రాంత తనిఖీలు ఉండవు. వాటి స్థానం పర్యటించడం మాత్రమే ఉంటుంది. అది కూడా జాతీయస్థాయిలో కంప్యూటర్ నిర్దేశిత పని ప్రాంతాల్లోనే. (ప్రభుత్వం ఏదైనా ఉత్తర్వు ద్వారా ఇస్తేనే తనిఖీ ఉంటుంది, అదీ వారి మార్గదర్శకాల ప్రకారం). తనిఖీ ఆన్లైన్లో చేయవచ్చు లేదా ఫోన్ ద్వారా చేయవచ్చు. యాజమాన్యాలకు ఈ విషయం చాలా ముందస్తుగానే తెలపాలి. ఓ.ఎస్.హెచ్.డబ్ల్యు.సి. కోడ్ ఈ తనిఖీలకు థర్డ్ పార్టీని స్టార్టప్ వ్యవస్థల ద్వారా ఏర్పాటు చేసుకునే అధికారాన్ని ప్రభుత్వాలకు కల్పిస్తోంది. తనిఖీల వ్యవస్థని తూట్లు పొడిచిన తర్వాత మిగిలిన అంశాలన్నీ కార్మికులకు నిరుపయోగమే.

పార్లమెంటరీ వ్యవస్థ స్థానంలో కార్యనిర్వాహక వ్యవస్థ

పనిగంటలు, భద్రత, ఆరోగ్యం, కనీస వేతనం నిర్ణయించే అంశాలు, వివిధ ప్రయోజనాలు, వాటాలు వంటివి కోడ్‌లలో పూర్తిగా నిర్వచించక పోవడంతో రానున్న రోజుల్లో వీటిలో ఏ విషయమైనా సరే పార్లమెంట్‌తో సంబంధం లేకుండా, యూనియన్లను కార్మికులను సంప్రదించకుండా నిర్ణయించవచ్చు. ఫాసిస్ట్ ఆర్.ఎస్.ఎస్. ఆదేశాలతో నడుస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మికులపై లేబర్ కోడ్‌లను ఆయుధంగా చేసుకొని యుద్ధం చేస్తోంది. కార్మికులకు పని ప్రాంత, కార్మిక సంఘ హక్కులను నిరాకరించడం ద్వారా వారి పని పద్ధతులు మరింత దుర్భరం చేసి శ్రమ శక్తిని మరింత దోచుకోవడానికి పాలక వర్గాలు కంకణం కట్టుకున్నాయని తెలుస్తోంది. లాభాల దాహంతో కార్పొరేట్లు, వారికి అండగా ప్రభుత్వంలో ఉన్న మతోన్మాద కార్పొరేట్ కూటమి కార్మిక వర్గంపై చేస్తున్న దాడిని ప్రతిఘటించాలి, ఓడించాలి. ఈ ధడ సంకల్పంతో కార్మిక వర్గం ఐక్యత పెంపొందించడానికి, పోరాటాలను తీవ్రతరం చేయటానికి, మరో దశ ఉద్యమానికి సన్నద్ధం కావాలి.

– డాక్టర్ కె.హేమలత, సిఐటియు అఖిల భారత అధ్యక్షులు

సమరశీల పోరాటాలకు చిరునామా అంగన్‌వాడీ ఉద్యమం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

సమరశీల పోరాటాలకు చిరునామాగా అంగన్‌వాడీ ఉద్యమం నడుస్తోంది. ఈ మధ్య కాలంలో సుదీర్ఘ కాలం పాటు జరిగిన 42 రోజుల సమ్మె అంగన్‌వాడీ ఉద్యమంలో కీలకంగా ఉంది. 2023 డిసెంబరు 12న మొదలైన ఈ సమ్మె 2024 జనవరి 22 వరకూ జరిగింది. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమ్మె డిమాండ్లకు అంగీకరించారు. ప్రధానంగా యూనియన్ ఇచ్చిన చార్టర్ ఆఫ్ డిమాండ్స్ 11లో 9 డిమాండ్లపై నిర్దిష్టంగా ఆదేశాలు ఇస్తామని ప్రభుత్వం అంగీకారాన్ని తెలిపింది. గ్రాట్యుటీ కేంద్రానికి నివేదించి, వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన అంగన్‌వాడీ ఉద్యమ చరిత్ర, ఉవ్వెత్తున సాగిన పోరాటాలు, ఉద్యమాలపై ప్రత్యేక కథనం.

ఉమ్మడి జిల్లాలో 28 ప్రాజెక్టుల పరిధిలో 5,113 మెయిన్, 433 మినీ అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. అన్ని కేంద్రాల్లోనూ సుమారు 3.25 లక్షల మంది పిల్లలు ఉన్నారు. వీటి పరిధిలో 5001 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 4,818 ఆయాలు విధులు నిర్వర్తిస్తున్నారు.

1991 లో సంఘం ఏర్పాటు

తూర్పుగోదావరి జిల్లాలో 1990 అక్టోబర్ 2 న అమలాపురం ప్రాజెక్టు ఏర్పడింది. అప్పట్లో వర్కర్లకు రూ.225, హెల్పర్లకు రూ.110 వేతనంగా ఇచ్చేవారు. అవికూడా ఆరు నెలలకు ఒకసారి మాత్రమే ఇచ్చేవారు. తొలినాళ్లలో అంగన్‌వాడీలు పలు అవమానాలను ఎదుర్కొనేవారు. సెంటర్లకు ప్రభుత్వం అద్దెలు చెల్లించేది కాదు. వంటకు పుల్లల బిల్లులు సైతం విడుదలయ్యేవి కావు. చెట్ల కింద, దేవాలయాల వద్ద పిల్లలకు వండి పెట్టే వారు. ఈ నేపథ్యంలో సిఐటియు, యుటిఎఫ్ ప్రోద్బలంతో 1991లో తొలిసారిగా ఇక్కడే సంఘం ఏర్పడింది. అమలాపురంలో తొలిసారిగా ఏర్పడిన సంఘానికి సంసాని విజయలక్ష్మి మొదటి కన్వీనర్‌గా పనిచేశారు.

1992 లో తొలి మహాసభ

1992లో అమలాపురంలో జరిగిన తొలి జిల్లా మహాసభకు పెద్దఎత్తున స్పందన వచ్చింది. సుమారు 250 మందితో మొదటి సభ ఉత్సాహవంతమైన వాతావరణంలో జరిగింది. అప్పటి నుంచి తొలి మహాసభ స్ఫూర్తితో అంగన్‌వాడీలు పోరాట పటిమకు అంకురార్పణ చేశారు. ఉద్యోగ భద్రత కోసమే కాకుండా అధికారుల వేధింపులు, అవినీతి,అక్రమాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున అంగన్వాడీలు పోరాటాలను ప్రారంభించారు. ఐసిడిఎస్ ను బలోపేతం చేయాలని, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం మెరుగ్గా ఉండాలని కూడా అనేక పోరాటాలు జరిపారు. మొదటి మహా సభ స్ఫూర్తిని కొనసాగిస్తూనే ఉద్యమాలు జరుపుతున్న తరుణంలో 1996లో కాకినాడ యుటిఎఫ్ హోమ్‌లో 2వ జిల్లా మహాసభ జరిగింది. ఈ సందర్భంగా సుమారు 1,500 మందితో కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా, అనంతరం నగరంలో భారీ ప్రదర్శన జరిపారు.

పోరాటాల ఫలితంగా స్పందించిన సర్కారు

జిల్లాలో ఉవ్వెత్తిన సాగిన అనేక పోరాటాల ఫలితంగా అంగన్‌వాడీలు పలు సౌకర్యాలను సాధించుకున్నారు. హెల్పర్ల సమస్యలపై ఆందోళనలు చేయగా అమలాపురం ప్రాజెక్టు పరిధిలో ఏడుగురు హెల్పర్లకు ఉద్యోగోన్నతి కల్పించారు. అయితే అప్పటి స్థానిక ఎంఎల్ఎ బుచ్చి మహేశ్వరరావు ఉద్యోగోన్నతి పోస్టులను నిలుపుదల చేయించారు. దాంతో అంగన్‌వాడీలు పోరాటాలను మరింత ఉధృతం చేశారు. పదేళ్ల సర్వీసు ఉన్న వర్కర్లకు సూపర్ వైజర్లుగా ప్రమోషన్ ఇవ్వాలని, ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఆరు నెలల పాటు ప్రసూతి సెలవులు, ఇతర క్యాజువల్ లీవులు, పుల్లల బిల్లులు, గ్యాస్ స్టవ్, ఇంటి అద్దెలు తదితర వాటిని ఇవ్వాలని పోరాటాలు సాగాయి. దాంతో అప్పట్లో ప్రభుత్వం జిఒ 7 ద్వారా పలు సౌకర్యాలను కల్పించింది.

నిర్బంధాలను ఎదుర్కొని పోరాటాలు

ఉద్యోగ భద్రత కోసం, ఐసిడిఎస్ బలోపేతానికి జరిపిన పోరాటాల్లో భాగంగా అంగన్‌వాడీలు అనేక సార్లు అరెస్టులయ్యారు. కేసులను ఎదుర్కొన్నారు. లాఠీ దెబ్బలను భరించారు. తీవ్రమైన నిర్బంధాలకు జంకకుండా ముందుకు సాగారు. ఉవ్వెత్తున సాగిన అనేక పోరాటాల నేపథ్యంలో



పలు విజయాలను సొంతం చేసుకున్నారు. వీరి పోరాటాలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతూ ఇళ్ల వద్ద కాపలాలు సైతం ఉండే వారు.కుటుంబ సభ్యులను కూడా ఇబ్బందులకు గురి చేసేవారు.అయినా మెరుగైన సౌకర్యాల కోసం అంగన్‌వాడీలు తమ ఉద్యమాలు, పోరాటాల జోరులో ఎక్కడా తగ్గలేదు. 1998లో చంద్రబాబు ప్రభుత్వం జిఒ 48 ద్వారా నియమించిన తల్లుల కమిటీలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశారు. కలెక్టరేట్, పీడీ, తహశీల్దార్, ఆర్‌డిఒ కార్యాలయాలను ముట్టడించి ఆందోళనలను కొనసాగించారు. 2000లో తల్లుల కమిటీ జీవోకి వ్యతిరేకంగా 'చలో హైదరాబాద్'కి యూనియన్ పిలుపునిచ్చింది.

ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా...

వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున పోరాటాలు చేశారు. సీనియారిటీ ఉన్న అంగన్‌వాడీలకు కాకుండా సూపర్ వైజర్ల పోస్టులను బయట వారితో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు అప్పటి ప్రభుత్వం సిద్ధపడింది. దాంతో పశ్చిమ గోదావరి జిల్లాలో గల ఆర్‌జెడి కార్యాలయాన్ని 24 గంటలపాటు ముట్టడించారు. పోలీసులు రంగప్రవేశం చేసి లాఠీఛార్జి చేశారు. వాటర్ ఫిరంగిని ప్రయోగించి అమానుషంగా ప్రవర్తించారు. అరెస్టులు చేసి స్టేషన్లకు తరలించారు. అయినప్పటికీ పోరాటం ఆగలేదు. దాంతో రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. అలాగే 2005లో రాష్ట్రంలో ఉన్న 44 ప్రాజెక్టులను జిల్లాలో ఉన్న 8 ప్రాజెక్టులను మూసివేసేందుకు వైఎస్ ప్రభుత్వం సిద్ధపడడంతో పెద్ద ఎత్తున ఆందోళనలు జరిపారు. ఇలా జిల్లాలో అంగన్‌వాడీ ఉద్యమం పెద్దఎత్తున సాగింది.

అలుపెరగని పోరాటాల్లో...

స్థానిక సమస్యలపై పోరాటాలు చేయడంలో జిల్లాలో అంగన్వాడీలు రాష్ట్రంలోనే ప్రత్యేకతను సంపాదించారు. సస్పెన్షన్లు, ప్రమోషన్లు, బదిలీలు ఇలాంటి స్థానిక సమస్యలపై నిరంతరం పని చేశారు. ఈ నేపథ్యంలో పలు పోరాటాల ఫలితంగా అంగన్‌వాడీలు అనేక సౌకర్యాలను కూడా సాధించుకోగలిగారు. జిల్లాలో అంగన్‌వాడీ సెంటర్లను ఏర్పాటు చేసిన తొలినాళ్లలో భవనాలు ఉండేవికావు. 1991లో సిఐటియు అనుబంధంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఏర్పడినప్పుడు భవనాల సౌకర్యం కల్పించాలని, అద్దెలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు పోరాటం చేశారు. దీంతో ప్రభుత్వం కొంతకాలానికి సెంటర్లకు కొన్ని సొంత భవనాలను మంజూరు చేయగా కొన్ని అద్దె భవనాల్లో నడుస్తున్నాయి.

పౌష్టికాహారం అందించాలని...

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను నెలకొల్పినప్పుడు కేవలం గర్భిణులు, బాలింతలు, తల్లిదండ్రులతో సంప్రదింపులు, వ్యాధి నిరోధక టీకాలు వేయించడం, ఆరోగ్య సలహాలు ఇవ్వడం వంటి సేవలను మాత్రమే అందించేవారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల నుంచి దిగుమతి అయ్యే కార్న్, సోయాబీన్స్ ద్వారా తయారు చేసిన పిండి ఉప్మాను వండి పెట్టే వారు. అంగన్‌వాడీల పోరాటాల ఫలితంగా ఉప్మాలోకి పోపులను కూడా అందించారు. కొంతకాలం తర్వాత పౌష్టికాహారంగా స్థానికంగా ఉన్న ఆహార పదార్థాలను అందించాలని ఆందోళనలు చేశారు. జిల్లాల 2000 సంవత్సరం నుంచి పోషకాహారం కోసం పోరాటాలు ఉధృతం చేశారు. గర్భిణులు, బాలింతలకు బియ్యం, పప్పులు, నూనె సరఫరా చేసేవారు స్థానికుల డిమాండ్ మేరకు ప్రభుత్వం కొంత కాలానికి అన్నం వండి పెట్టించడం మొదలు పెట్టింది. వివిధ సందర్భాల్లో పోరాటం ఫలితంగా ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల లోపు పిల్లలకు పోషకాలు కలిగిన బాలామృతం అందిస్తున్నారు. అలాగే మూడు నుండి ఆరు సంవత్సరాల లోపు వయసు గల పిల్లలకు పౌష్టికాహారం గల భోజనాన్ని వండి పెడుతున్నారు. ప్రస్తుతం అన్ని కేంద్రాల్లోనూ గుడ్లు, పాలు కూడా సరఫరా చేస్తున్నారు.అలాగే జిల్లాలో వంట పాత్రల కోసం ఆందోళనలు చేయగా స్పందించిన ప్రభుత్వం స్థానిక పంచాయతీల నుండి సమకూర్చారు.

ప్రమోషన్ల కోసం పోరుబాట..

ఆయాలుగా పనిచేస్తున్న హెల్పర్లకు వర్కర్లుగా ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద గతంలో పెద్దఎత్తున ఆందోళన చేయగా ప్రభుత్వం స్పందించింది. పోరాటం ఫలితంగా హెల్పర్లకు వర్కర్లుగా అవకాశం కల్పించారు. పదేళ్ల అనుభవం ఉన్న వర్కర్లకు సూపర్ వైజర్లుగా ప్రమోషన్ కల్పించారు. ఏడేళ్ల కాలంలో జిల్లాలో సుమారు 30 మందికి ఈ ప్రమోషన్లు వచ్చాయి. అలాగే అన్ని సెంటర్ల పరిధిలో 2016 నుంచి అంగన్‌వాడీలతో పాటు లబ్ధిదారులకు బయోమెట్రిక్‌ను ప్రవేశ పెట్టాలని ప్రభుత్వం భావించింది. ఈ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకించిన అంగన్‌వాడీలు పోరాడారు.

పని ఒత్తిళ్లు, వేధింపులపై...

దేశంలోని బాల బాలికలకు, గర్భవతులకు పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల వ్యవస్థను ప్రవేశ పెట్టింది. అంగన్‌వాడీ ఉద్యోగులకు నిర్దిష్టమైన విధులను కూడా అప్పగించారు. అయితే వారి విధులకు ఆటంకం కలిగిస్తూ ఇతర పనులు అప్పగిస్తూ శ్రమదోపిడీకి గురి చేస్తున్నారన్నారు. పార్టీలు మారినప్పుడల్లా అంగన్‌వాడీ ఉద్యోగులపై వేధింపులు అధికమవుతున్నాయి. తీవ్ర పని ఒత్తిడితో తాము విధులను నిర్వర్తించలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వేధింపులను భరించలేక సతమతమవుతున్నామని చెబుతున్నారు.

అదనపు పనులతో సతమతం

ఐసిడిఎస్ లక్ష్యాలు, ఉద్దేశాలు పక్కన పెట్టిన ప్రభుత్వం అంగన్వాడీలతో గొడ్డు చాకిరీ చేయిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. ఈ నేపథ్యంలో వారు అనేక అదనపు పనులతో తీవ్రస్థాయిలో సతమతమవుతూ ఇబ్బందులు పడుతున్నారు. వీరు చేసే విధుల్లో భాగంగా ఐసిడిఎస్ అధికారులు అంతా ఆన్‌లైన్ లో పొందుపరచాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. నాణ్యతలేని సెల్ ఫోన్‌లను పంపిణీ చేసి వాటి ద్వారా పెద్ద ఎత్తున డేటా నిక్షిప్తం చేయాలని చెబుతున్నారు. పలు ప్రాంతాల్లో సెల్ ఫోన్ సిగ్నల్స్ సక్రమంగా పనిచేయక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ఏజెన్సీలో పనిచేస్తున్న అంగన్‌వాడీలకు ఈ సమస్యను ఎక్కువగా ఉంది. సిగ్నల్స్ వచ్చే ప్రాంతాలకు వెళ్లి ప్రతిరోజూ డేటా ఎంట్రీ చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. అంగన్‌వాడీ టీచర్లు నిరంతరం అదనపు పనులతోనే సతమతమవుతున్నారు. దాంతో ప్రీ స్కూల్‌లో పిల్లలకు ఆట, పాట నేర్పించేవారు కరువయ్యారు. దీంతో ఆయాలపై కూడా అదనపు భారం పడుతుంది.

అధికారుల పెత్తనం

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తామని చెబుతున్న కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. అందులో భాగంగానే జాబ్‌చార్ట్‌లో లేని విధులకు అంగన్‌వాడీ ఉద్యోగులను కేటాయిస్తూ ప్రణాళికాబద్ధంగా కేంద్రాలను నిర్వీర్యం చేస్తున్నారు. కొన్ని చోట్ల మహిళా అధికారులు సైతం ఇబ్బందులకు గురిచేయడం శోచనీయం.ఇన్ని వేధింపుల మధ్య విధులకు హాజరౌతున్న అంగన్‌వాడీ ఉద్యోగులపై రాజకీయ వేధింపులు కూడా ఎక్కువవుతున్నాయి.

స్టార్టప్‌లకు గడ్డుకాలం

- రెండేళ్లలో 28వేలకు పైగా కంపెనీలు క్లోజ్
- కొత్తగా వచ్చేవి కూడా చాలా తక్కువే..!
- ఈ ఏడాదిలో స్థాపించినవి 125 మాత్రమే
- 'ట్రాక్సన్' నివేదిక సమాచారం

న్యూఢిల్లీ : దేశంలోని మోడీ పాలనలో అంకుర సంస్థలు(స్టార్టప్‌లు) అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలవాలనీ, ఉద్యోగ కల్పనలో తమ వంతు పాత్ర పోషించి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని చూస్తున్న యువపారిశ్రామికవేత్తలకు అలాంటి పరిస్థితులు కనబడటం లేదు. ఇది వారిని తీవ్ర నిరాశకు, కలవరానికి గురి చేస్తున్నది. దేశంలో వేల సంఖ్యలో స్టార్టప్‌లు మూతపడుతుండటమే ఈ పరిస్థితికి నిదర్శనం. భారత్‌లో గత రెండేండ్లలో 28 వేలకు పైగా స్టార్టప్‌లు క్లోజ్ అయ్యాయి. డేటా ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ ట్రాక్సన్ నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది.

రెండేండ్లలో 12 రెట్లు అధికం

ఈ నివేదిక సమాచారం ప్రకారం.. గత రెండేండ్లలో 28,638 స్టార్టప్‌లు క్లోజ్ అయ్యాయి. ఇందులో, 2023లో 15,921, 2024లో 12,717 కంపెనీలు ఉన్నాయి. స్టార్టప్‌లు మూతపడుతున్న తీరు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నది. గత రెండేండ్లలో మూతపడిన స్టార్టప్‌ల సంఖ్య అనేది.. 2019 నుంచి 2022 మధ్య క్లోజ్ అయిన కంపెనీల సంఖ్య కంటే 12 రెట్లు అధికంగా కావటం గమనార్హం. ఈ మూడేండ్లలో క్లోజ్ అయిన అంకుర సంస్థల సంఖ్య 2300.

తగ్గిపోతున్న స్టార్టప్‌లు

దేశంలో కొత్తగా ఏర్పాటు చేసే స్టార్టప్‌ల సంఖ్య కూడా తగ్గిపోవటం ఆందోళనను కలిగిస్తున్నది. 2019 నుంచి 2022 మధ్య నెలకొల్పబడిన అంకుర సంస్థల సంఖ్య 9600కు పైగా ఉండగా.. అది 2024లో 5264కు పడిపోయింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు స్థాపించబడిన స్టార్టప్‌లు 125 మాత్రమే కావటం గమనార్హం. ఈ మూసివేతలు అధికంగా అగ్రిటెక్, ఫిన్‌టెక్, ఎడ్‌టెక్, హెల్త్‌టెక్ రంగాలలో జరిగాయని తెలుస్తున్నది. స్టార్టప్‌ల కొనుగోలు సంఖ్య కూడా తగ్గిపోయింది. 2021లో ఇది 248గా ఉండగా.. గతేడాది 131కి పడిపోయింది. ఈ ఏడాదిలో ఇప్పటికే 259 స్టార్టప్‌లు క్లోజ్ అయ్యాయి.

ప్రభుత్వ చేయూత లేకే ఈ పరిస్థితి

అంకుర సంస్థలు దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకం. యువతను ఉద్యోగార్థుల్లా కాకుండా.. ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. వారి ఆర్థిక స్వావలంబనకు అవకాశాన్ని కల్పిస్తాయి. కాబట్టి.. వివిధ రంగాల్లో కొత్తగా కంపెనీలు ఏర్పాటు చేసేవారికి, యువతకు ప్రభుత్వం నుంచి మద్దతు చాలా తప్పనిసరి. స్టార్టప్‌లకు ఎదురేయ్యే కష్టాలను గుర్తించి, వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలి. అయితే, కొన్నేండ్ల క్రితం స్టార్టప్‌లపై ప్రభుత్వాలు పెట్టిన శ్రద్ధ.. ప్రస్తుతం కనబడటం లేదు. ఈ కారణంగానే అంకుర సంస్థలు మూతపడుతూ, కొత్తవి ఏర్పాటు కాక.. క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని నిపుణులు చెప్తున్నారు.

కేరళ ప్రత్యామ్నాయం.. పారిశ్రామిక రంగం

మానవాభివృద్ధి సూచికలలో నిరంతరం పురోగమించడం ద్వారా గుర్తింపు పొందిన కేరళ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. దీనికి కారణం ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకై నికరంగా రాష్ట్రంలో జరుగుతున్న కృషి. కేరళ అభివృద్ధి నమూనాలో అందరికీ విద్య, ఆరోగ్యం అందించడం ఉంది. ఇది అంతర్జాతీయంగా మన్ననలు పొందింది. ఉత్పత్తి రంగాలైన వ్యవసాయం, పరిశ్రమల వంటి వాటిలో పురోగమించకుండా ఈ నమూనా కొనసాగించగలమా అని ఇ ఎం ఎస్ నంబూద్రిపాద్ ఒకసారి అభిప్రాయం వ్యక్తం చేశారు. గత రెండు ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాలు రెండు కీలక అంశాలపై దృష్టి సారించాయి. సామాజిక సేవా రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా నాణ్యమైన విద్య, ఆరోగ్య సదుపాయాలు, సంక్షేమం అందించడం, మౌలిక సదుపాయాలు అభివద్ధి చేస్తూ వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో ఉత్పత్తి పెంచడం.

ప్రభుత్వ నూతన పారిశ్రామిక విధానం "ప్రకతి-ప్రజలు-పరిశ్రమలు" నినాదంతో కేరళ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి ఎదుర్కొంటున్న ప్రత్యేక సవాళ్ల దృష్టితో రూపొందింది. పర్యావరణం పరిస్థితి, అందుబాటులో ఉన్న భూమి ధర, రాష్ట్ర పారిశ్రామికీకరణకు ఆటంకంగా ఉన్నాయి. తదనుగుణంగా ప్రభుత్వ దృష్టి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పైన, మేధస్సు ఆధారిత పరిశ్రమలపైన కేంద్రీకరించారు. 2022-23 ఆర్థిక



సంవత్సరంలో ప్రభుత్వం "ఇయర్ ఆఫ్ ఎంటర్‌ప్రైజెస్" క్యాంపెయిన్ ప్రారంభించి ఆ ఒక్క సంవత్సరంలో లక్ష కొత్త సంస్థలను ఏర్పాటు చేయాలని లక్ష్యం చేసుకుంది. ఈ ప్రయత్నం సమన్వయంతో జరిగింది. ముఖ్యమంత్రి హాజరయ్యే సమావేశాలకు ఆయా శాఖల మంత్రులను భాగస్వామ్యం చేయడం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సారథ్యా1న ఉన్నత స్థాయి కమిటీ వేసి ఈ క్యాంపెయిన్‌ను పర్యవేక్షించారు. పరిశ్రమల మంత్రిత్వశాఖ కూడా చిన్న తరహా పరిశ్రమల సంఘాలను, కార్మిక యూనియన్‌లను సంప్రదించడం ద్వారా ఇవి సక్రమంగా అమలుచేయడానికి కృషి చేసింది.

ఈ క్యాంపెయిన్ విజయవంతం కావడానికి స్థానిక స్థాయిలో పారిశ్రామిక అభివృద్ధి జరగడానికి పారిశ్రామిక విభాగం మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను రిక్రూట్‌చేసుకుంది. చిన్న పెట్టుబడిదారులను ప్రోత్సహించడానికి నాలుగు శాతం వడ్డీ రేటు తగ్గించి వడ్డీ మినహాయింపు పథకాన్ని ప్రవేశపెట్టింది. సూక్ష్మ, చిన్న పెట్టుబడిదారులకు ఉపయోగకరంగా ఉండేట్లు రుణ మేళాలను నిర్వహించింది. స్థానిక పరిశ్రమల్లో టెక్నాలజీ వినియోగం పెంచడానికి, మంత్రిత్వశాఖ రీసెర్చ్ సంస్థలతో సమావేశాలు నిర్వహించి టెక్నాలజీ బదలాయింపునకు ప్రయత్నం చేసింది. నిర్దిష్ట సర్వే, సంప్రదింపుల ద్వారా స్థానిక తయారీలో చేయగలిగిన ప్రధాన ఉత్పత్తులను మంత్రిత్వశాఖ గుర్తించింది.

ఎంఎస్‌ఎంఇల లైసెన్సింగ్ విధానంలో ప్రభుత్వం గణనీయమైన మార్పు చేసింది. మొదటి మూడున్నర సంవత్సరాల పాటు లైసెన్స్ లేకుండా నిర్వహించుకుని, దాని తర్వాత అవసరమైన అన్ని లైసెన్సులు పొందేట్లు అవకాశం కల్పించింది. ఆన్‌లైన్ విధానం ద్వారా సింగిల్ విండో పద్ధతిలో పూర్తి చేయడమనే ఒక్క నిబంధనే పెట్టారు. ఈ క్యాంపెయిన్ తన లక్ష్యాన్ని ఆరు నెలల్లో చేరుకోవడమే కాకుండా తర్వాత ఆర్థిక సంవత్సరాల్లోనూ కొనసాగింది. 2024 నవంబర్ నాటికి 3,21,581 ఎంఎస్‌ఎంఇలు రూ.20,625 కోట్ల పెట్టుబడితో 6,82,241 ఉద్యోగాలను కల్పించారు. వ్యక్తిగత పొదుపు, బంగారం, ఎన్నారైల నుండి వచ్చిన సొమ్ము పారిశ్రామిక పెట్టుబడిగా మారింది. స్థానిక ఆర్థిక వ్యవస్థను ఇది బలోపేతం చేసింది.

అందర్నీ భాగస్వామ్యం చేయడమనేది ఈక్యాంపెయిన్‌లో కీలక అంశం. నూతన వ్యాపారం ప్రారంభించిన వారిలో 1,02,942 మంది మహిళలు, 37 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. సామాజిక తరగతులుగా చూస్తే షెడ్యూల్డ్ కులాల నుండి 11,794, షెడ్యూల్డ్ తెగల నుండి 945, మైనార్టీల నుండి 23,645 మంది ఉన్నారు. వచ్చిన సంస్థల్లో 45,233 తయారీ రంగంలోవి కాగా, సేవా రంగంలో 1,33,576 వచ్చాయి. ఈ వివరాలన్నీ పబ్లిక్ డొమైన్‌లో ఉన్నాయి.


ఎంఎస్‌ఎంఈలకు అండగా ఉండడానికి చార్టెడ్ అకౌంటెంట్స్ సంస్థ ఐసిఎఐ జిల్లా స్థాయిల్లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి జిఎస్‌టి రిటర్న్లు, ఆర్థిక పత్రాలు తయారు చేయడానికి ఉచితంగా సేవలందించింది. ప్రభుత్వం కూడా జిల్లా స్థాయిలలో ఎంఎస్‌ఎంఇ క్లినిక్‌లను ఏర్పాటుచేసి టెక్నికల్, మేనేజ్మెంట్, మార్కెటింగ్ రంగాల్లో వత్తిపరమైన నైపుణ్యం ఉచితంగా అందించింది. వీటికి అదనంగా ఎంఎస్‌ఎంఇల ఇన్సూరెన్స్ ప్రీమియంలపై 50 శాతం రాయితీ ఇస్తూ నూతన ఇన్సూరెన్స్ పథకాన్ని తీసుకొచ్చింది. మార్కెట్లో అవకాశం కల్పించడానికి ప్రజాపంపిణీ మంత్రిత్వ శాఖతో పరిశ్రమల శాఖ ఒక ఒప్పందం కుదుర్చుకుని స్థానిక పరిశ్రమలకు కె షాపులలో(రేషన్ షాపులకు అనుసంధానంగా ఏర్పాటు చేసినవి) ఉచితంగా స్థలం కేటాయించారు. ఆరు నెలల్లో ఈ కె షాపులు 10 కోట్ల అమ్మకాలు చేశాయి. ప్రభుత్వ రంగ సంస్థలు, సాంప్రదాయక రంగాలు, ఎంఎస్‌ఎంఇలు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి అనువుగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫారాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. కార్మికుల్ని భాగస్వామ్యం చేస్తూ మంచి స్థాయిలో నాణ్యతను, పర్యావరణ బాధ్యత, నియమాలకు కట్టుబడి చేస్తున్న ఉత్పత్తులను పెంచడానికి "కేరళ బ్రాండ్" తెచ్చారు. అధికారులు వ్యక్తిగతంగా కొత్త సంస్థలను పర్యవేక్షించి జియో టాగింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. తమ విభాగం ద్వారా ఇబ్బంది పడుతున్న పెట్టుబడిదారుల ఉనికికి, అభివద్ధికి సహకారం అందించారు. ఈ రకంగా ప్రభుత్వం కొత్త ఎంఎస్‌ఎంఈల పరిరక్షణకు కృషి చేసింది.

"మిషన్ థౌజండ్" అనే పథకాన్ని ప్రభుత్వం తీసుకురావడం ద్వారా రూ.100 కోట్ల సగటు టర్నోవర్ ఉండే విధంగా అవసరమైన ఆర్థిక సహాయాన్ని తోడ్పాటును అందించి 1000 పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి కృషి చేసింది. క్యాంపస్ పారిశ్రామిక పార్కుల పేరిట ప్రవేశపెట్టిన వినూత్న పథకం ద్వారా చిన్న పరిశ్రమలకు ఆయా క్యాంపస్‌లలో భూమిని కేటాయించి, గంటల వారీ వేతనంతో విద్యార్థులను వినియోగించుకోవడం ద్వారా విద్యకూ, ఇటు పరిశ్రమలకూ ప్రత్యక్ష సంబంధం కల్పించారు. ఈ రకమైన ప్రయత్నాలు అన్నీ కూడా కేరళ రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఈలు పారిశ్రామిక సంవత్సరంలో పుంజుకోవడానికి దారితీశాయి. కేంద్ర ప్రభుత్వం కూడా ఇది ఉత్తమమైన ప్రయత్నమని కొనియాడింది.

ఇటీవలే ప్రభుత్వం గహాధారిత చిన్న వ్యాపారాలకు కూడా పారిశ్రామిక లైసెన్సులు మంజూరు చేసి విద్యాధికులైన గృహ యజమానులు సంపాదన పెంచుకునేట్లు చూడాలని నిర్ణయించింది. స్వయం సహాయక గ్రూపుల కోసం ప్రారంభించిన "కుటుంబశ్రీ" పథకం ప్రస్తుతం అతి సూక్ష్మ, సూక్ష్మ పరిశ్రమల పైన కేంద్రీకరించింది. మొత్తంగా ఈ ప్రయత్నాలన్నీ కేరళ రాష్ట్రాన్ని ఎంఎస్‌ఎంఈలకు కేంద్రంగానూ, రాష్ట్రవ్యాప్తంగా ఆర్థిక పురోగతికి స్థిరత్వానికి తోడ్పడే దిశగానూ సాగుతున్నాయి.

- పి.రాజీవ్

> నలుగురూ నడిచే దారిలో నడవడం క్షేమం అనుకుంటారు అందరూ. అందుకే అన్ని విషయాల్లోనూ మూస పద్ధతులను అనుసరిస్తారు. వాటిని వదిలేసి సొంత ఆలోచనలతో ముందుకు వెళ్తూ ఆదర్శంగా నిలిచేవాళ్లు చాలినంత మంది సమాజంలో కనపడరు. అందుకే సంఘసంస్కరణకి శతాబ్దాలు పడుతుంది.
>
> - రాహుల్ సాంకృత్యాయన్, ప్రఖ్యాత రచయిత



ఉద్యమాల వేగుచుక్క బాలాజీదాస్



ధైర్యం, సాహసం, పేదల పక్షాన పోరాటం జిఎస్.బాలాజీదాస్ సొంతం. శ్రమజీవుల హక్కుల సాధన కోసం అలుపెరగని పోరాటం చేసి వారి జీవితాల్లో వెలుగు బాటలు వేసిన కమ్యూనిస్టు యోధుడు ఆయన. అన్నా పార్టీలనూ ఏకతాటిపైకి తెచ్చి సమస్యలపై సమరశంఖం పూరించిన ఘనత ఆయనది. కరుడుగట్టిన ప్రభుత్వాలు ఆయన్ని జైళ్లలో నిర్బంధించినా ధైర్యంగా ఎర్రజెండాను ఎగురవేసిన సాహసి. మనసున్న మంచి కామ్రేడ్‌గా రాజమండ్రి ప్రజల గుండెల్లో ఇప్పటికీ చిరస్థాయిగా ఉన్నారు. ఆయన స్మృతి చిహ్నంగా రాజమండ్రిలోని శ్యామలాసెంటర్‌లో కాంస్య విగ్రహాన్ని ప్రజలు నెలకొల్పారు.

బాల్యం నుంచే పోరాటతత్వం

జిఎస్.బాలాజీదాస్ అదందరితో పిలుపించుకునే గురువుగారి సింహాచలం బాలాజీదాస్ 1920 జూలై 20న కృష్ణా జిల్లా నూజివీడులో మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి సమీపంలోని వెంకటగిరిలో ప్రాథమిక విద్యాభ్యాసం కొనసాగించారు. చిన్నతనం నుంచే బ్రిటీష్; జమిందారు దొరతనాలకు వ్యతిరేకంగా పోరాడేతత్వాన్ని సంతరించుకున్నారు. వెంకటగిరి పాఠశాలలో చదువుతుండగా జమిందారుకు గౌరవ సూచకంగా విద్యార్థులు తలపాగా ధరించాల్సిందనే నియమాన్ని... తన స్వేచ్ఛకు భంగంగా భావించి దాన్ని తిరస్కరించారు. ఫలితంగా తరగతి నుంచి బహిష్కరణకు గురయ్యారు. 1939లో స్కూల్ ఫైనల్ ఉత్తీర్ణత సాధించి కాకినాడకు మకాం మార్చారు. పిఠాపురంలో ఉండగానే చిత్తాడ చిన్న అనే కమ్యూనిస్టు కార్యకర్త ద్వారా రవణం శ్రీరాములుతో పరిచయం ఏర్పడింది. అనంతరం చెలికాని రామారావు సహచర్యంతో విద్యార్థి ఉద్యమంలో పనిచేశారు. 1934లో పార్టీ సభ్యత్వం స్వీకరించారు. బ్రిటీష్ పాలకులకు, దోపిడీవర్గాలకు వ్యతిరేకంగా బాలాజీదాస్ ఏడు దశాబ్దాలపాటు పోరాడారు. అనేక విద్యార్థి ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారు. ప్రభుత్వ నిర్బంధం కారణంగా బిఎస్‌సి డిగ్రీ పూర్తిచేయలేకపోయారు. 1942లో రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో జరిగిన సమ్మెకు బాలాజీదాస్ నాయకత్వం వహించారు. అప్పటి ప్రభుత్వం ఆయన్ని నిర్బంధించి బళ్లారి జైల్లో పెట్టింది. నాలుగు నెలల అనంతరం ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. 1939లో పీచు కార్మికుల సమ్మె, కార్గోబోటు, మున్సిపల్ కార్మికుల పోరాటాల్లో చురుకైన పాత్ర పోషించారు. 1943-44 మధ్య అనేక కార్మిక పోరాటాలు నిర్వహించారు. వేల సంఖ్యలో కార్మికులను ఐక్య పరచి పోరాటాలు నడిపిన ఘనత ఆయనకే దక్కుతుంది. 1945లో ఆయన పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. దాదాపు 50 ఏళ్లపాటు అంటే 1995 వరకూ ఆ బాధ్యతలో ఉన్నారు.

నిర్బంధంలోనూ పోరాడిన కామ్రేడ్

ఉద్యమ జీవితంలో బాలాజీదాస్ ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. తృటిలో ప్రాణాపాయం తప్పించుకున్న సంఘటనలు, నిర్బంధాలు అనేకం. 1945-46లో రాష్ట్ర వ్యాప్తంగా అనేక పోరాటాలు జరిగాయి. ప్రజల పక్షాన కమ్యూనిస్టులు పోరాటం చేయడానిన జీర్ణించుకోలేని అప్పటి ప్రభుత్వం కమ్యూనిస్టులను చిత్రహింసలకు గురిచేసింది. ఈ నేపథ్యంలో చిట్టూరి ప్రభాకర్‌చౌదరి, సివికె.రావు, ఎంవి.భద్రం తదితరులు అరెస్టు కాగా, బాలాజీదాస్ తప్పించుకుని రహస్య జీవితం గడిపారు. 1946లో పార్టీపై పూర్తి నిర్బంధం ఉన్న సమయంలో రాజమండ్రి పురపాలక సంఘానికి ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో బాలాజీదాస్‌తో పాటు పది మంది పార్టీ సభ్యులు, పార్టీని బలపరిచిన ఒక ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందడం పార్టీ చేసిన పోరాటాలకు ప్రజల్లో ఏర్పడ్డ విశ్వాసానికి నిదర్శనం. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ కమ్యూనిస్టులకు మాత్రం కష్టాలు తప్పలేదు. 1948లో గాంధీజీ హత్యకు గురైన సమయానికి రాజమండ్రి సుబ్రహ్మణ్యం మైదానంలో ఎఐఎస్ఎఫ్ సభ జరుగుతుంది. ఈ సభపై దాడి చేయడానికి ఆర్ఎస్ఎస్ సభ్యులు ప్రయత్నించినప్పుడు బాలాజీదాస్, ఆయన అనుచరులు సాహసంతో అడ్డుకున్నారు.

1948లో కలకత్తాలో పార్టీ రెండో మహాసభ జరిగింది. జిల్లా నుంచి బాలాజీదాస్, పెనుమత్స అనంతం, మాడభూషి భావనాచారి, చింతం సత్యనారాయణ ప్రతినిధులుగా హాజరయ్యారు. వీరిని అరెస్టు చేసేందుకు అక్కడి పోలీసులు సిద్ధం కావడంతో ఓ సినీ నిర్మాత ఇంట్లో వీరికి డెన్ ఏర్పాటు చేశారు. అదే సమయంలో బాలాజీదాస్‌కు వివాహ తేదీ నిర్ణయం అయినట్లు సమాచారం అందింది. రహస్య జీవితంలో ఉన్న తాను వివాహం చేసుకోవాలా? వద్దా అని దాస్ సందిగ్ధంలో పడ్డారు. అప్పటి జిల్లా కార్యదర్శి పెనుమత్స అనంతం-'వివాహం చేసుకో... పర్లేదు..' అని సలాహ్ ఇచ్చారు. దీంతో మార్చి 12న శ్రీకాళహస్తిలో ఆయనకు కృష్ణ కుమారితో వివాహం అయ్యింది. ఆ మరుసటి రోజేనే రహస్య జీవితంలోకి వెళ్లిపోయారు.

రాజమండ్రి మున్సిపల్ వైస్‌ఛైర్మన్‌గా...

తెలంగాణా సాయుధ పోరాటం సమయంలో పార్టీపై పోలీసు నిర్బంధం తీవ్రమైంది. బాలాజీదాస్‌ను రాజమండ్రిలో అరెస్టు చేశారు. 1948 ఆగస్టు 14న ఆయన మరో తొమ్మిది మందితో కలిసి సెంట్రల్ జైలు నుంచి తప్పించుకున్నారు. ఖైదీలు పడుకునేందుకు ఇచ్చిన నులక చాపలను కోసి తాడుగా పేని, దాని ద్వారా గోడ దూకారు. కమ్యూనిస్టు పోరాట యోధునిగా పెరిగిన బాలాజీదాస్ వర్గ పోరాట పంథాపైనే నిలబడ్డారు. 1959-64 మధ్య రాజమండ్రి మున్సిపల్ వైస్‌ఛైర్మన్‌గా పనిచేశారు. మధ్యలో కొంతకాలం ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా వ్యవహరించారు. 1962లో ఇండోచైనా యుద్ధం సందర్భంగా భారత ప్రభుత్వం మళ్లీ పార్టీపై నిర్బంధం విధించింది. పోలీసులు బాలాజీదాస్‌ను అరెస్టు చేసి హైదరాబాద్ జైలుకు తరలించారు. అనంతరం జైలుకు వెళ్లిన నాయకులందరూ 1964లో కలకత్తాఓ జరిగిన ఏడో మహాసభకు హాజరయ్యారు. అదే సమయంలో సిపిఎం ఆవిర్భవించింది. ఈ సభకు బాలాజీదాస్ ప్రతినిధిగా హాజరయ్యారు.

తుది శ్వాస వరకూ ఉద్యమ జీవితం

1970లో ఏర్పడిన సిఐటియు ప్రథమ మహాసభ బాలాజీదాస్ నాయకత్వంలో రాజమండ్రిలో జరిగింది. ఎఐటియుసి నుంచి బయటకు వచ్చిన బాలాజీదాస్ కార్మిక సంఘం నాయకునిగా ఎదిగారు. 1974లో జరిగిన రైల్వే సమ్మె సందర్భంగా తిరిగి ఆయన రహస్యజీవితంలోకి వెళ్లారు. 1975లో ఎమర్జెన్సీ సందర్భంగా మళ్లీ అరెస్టయ్యారు. అంతకు ముందునుంచి మార్క్సిస్ట్ జిలా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. 1995 వరకూ జిల్లా కార్యదర్శిగా ఉన్నారు. కార్మికోద్యమంలో బాలాజీదాస్ నిర్వహించిన భూమిక మరువలేనిది. 1945లో ఎపి ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, ఎఐటియుసి తరువాత ఏర్పడిన సిఐటియులో ఆయన రాష్ట్ర స్థాయి బాధ్యతలు నిర్వహించారు. కమ్యూనిస్టు అగ్రనాయకులైన మాకినేని బసవపున్నయ్య, చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, బిటి రణదివే తదితరులతో పనిచేశారు.

1964లో సిపిఎం ఏర్పడినప్పుడు కొంత కాలం ఇనుగంటి నారాయణరావు జిల్లా కార్యదర్శిగా ఉన్నారు. ఆ తరువాత బాలాజీదాస్ రెండు దశాబ్దాల పాటు పార్టీకి నాయకత్వం వహించారు. బాలాజీదాస్ జీవితం ఆద్యంతం సాహసవంతమైనది. ఉద్యమం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయలేదు. తీవ్ర నిర్బంధం ఉన్న సమయంలో కూడా ధైర్యంగా ఉద్యమ నిర్మాణం చేపట్టారు. వయస్సు పైబడినా కాలు సహకరించకపోయినా చివరివరకూ ఉత్సాహంతో పనిచేశారు. 2003 ఫిబ్రవరి 18న తుది శ్వాస విడిచేవరకూ సిపిఎం రాజకీయ విధానానికి, సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన బాలాజీదాస్ చిరస్మరణీయుడు.

రెడ్ సెల్యూట్ కామ్రేడ్ బాలాజీదాస్

- టిఎస్.ప్రకాష్

కాలుష్యంపై కర్షకుడి విజయం

ఉవ్వెత్తున సాగిన దివీస్ ఉద్యమం

సిపిఎం అండతో సమరశీల పోరాటం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఉద్యమం ఎగిసింది. కాలుష్యంపై కన్నెర్రజేసిన కర్షకులకు కార్మికులకు వృత్తి దారులుసైతం తోడవడంతో దివీస్ వ్యతిరేక పోరు పతాక స్థాయికి చేరింది. సిపిఎం నాయకత్వం నేరుగా రంగంలోకి దిగి అండగా నిలవడంలో ఆందోళనలు మిన్నంటాయి. ఆంక్షలు పెట్టినా సామాన్యుడిని అడ్డుకోలేకపోయాయి.పోలీసులు మోహరించినా ఫలితం లేకుండా పోయింది.అరెస్టులు చేసి, కేసులు పెట్టినా వెనక్కి తగ్గలేదు. అధికార తెలుగుదేశం పార్టీ నేతలు,ముఖ్యంగా యనమల సోదరులు ఉద్యమ విచ్ఛిన్ననికి వివిధ రూపాల్లో ప్రయత్నించారు. బెదిరింపులు, ఇతర రూపాల్లో కూడా ప్రయత్నించినా ప్రజలు వెనుకాడలేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే కాలుష్య పరిశ్రమలకు వ్యతిరేకంగా సాగిన సమరశీల ఉద్యమాల్లో ఒకటిగా దివీస్ పోరాటం నిలిచింది. చివరకు ప్రభుత్వం దిగొచ్చేవరకు ఉద్యమం చల్లారలేదు. సిపిఎం నాయకత్వంలో సాగిన సుదీర్ఘపోరాటంతో కార్పొరేట్ యాజమాన్యం వెనకడుగు వేయక తప్పలేదు. వివిధ విపక్ష పార్టీల నేతలు, ప్రజా సంఘాలు సైతం దివిస్ ఉద్యమానికి సంఘీభావం గా నిలిచాయి. దాంతో 9 నెలల పాటు సాగిన ఉద్యమంతో ప్రజాభిప్రాయమే పై చేయి సాధించింది.కేంద్ర పర్యావరణ శాఖ కూడా పరిశ్రమ ఏర్పాటుకు అనుమతి నిరాకరించింది. అయినా పోలీసులు నేటికి దివిస్ ప్రాంత ప్రజలపై ఆంక్షలను కొనసాగిస్తున్నారు.

కాకినాడ జిల్లా తొండంగి మండలం కోన తీర ప్రాంతాలైన తాటాకుల పాలెం, కొత్త పాకలు,పంపాదిపేట గ్రామాల పరిధిలో ప్రభుత్వం సుమారు ఆరు వందల ఎకరాల్లో దివిస్ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేసింది. కాలుష్యం వెలువడే పరిశ్రమ మాకొద్దు అంటూ స్థానిక రైతులు తీవ్ర స్థాయిలో వ్యతిరేకించారు. తీర ప్రాంత గ్రామాల మనుగడ పూర్తిగా దెబ్బతింటుందని పేర్కొంటూ అక్కడి రైతులు భూములు ఇచ్చేందుకు నిరాకరించారు. ఎలాగైనా బలవంతంగా భూములను లాక్కొని పరిశ్రమ ఏర్పాటుకు సర్కారు కుటిలయత్నాలు చేసింది. అయితే ప్రజా వ్యతిరేకతకు చివరకు తలొగ్గక తప్పలేదు. కారుచౌకగా అప్పనంగా కొట్టేసే ప్రయత్నాలను అడ్డుకున్నారు పరిశ్రమల కుంపటిని తెచ్చిపెట్టిన అధికార పార్టీ నాయకుల తీరును దుయ్యబట్టారు ఎకరాకు రూ.60 నుండి 80 లక్షలు పలుకే భూములను కేవలం రూ.ఐదు లక్షలకు లాక్కోవలనే పరిశ్రమ యాజమాన్యం కుట్రలను పోరాడిన రైతుల భగ్నం చేశారు.

ఆదిలోనే అడ్డుకున్న రైతులు

దివిస్ పరిశ్రమకు భూములు ఇచ్చేందుకు నిరాకరించిన మూడు గ్రామాల ప్రజలు ఆదిలోనే పనుల్ని అడ్డుకుని నిరసన తెలిపారు. 2016 ఆగస్టు 28న ల్యాబ్ నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన పాకలను తొలగించారు. తాటాకులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఎటువంటి పనులు జరగనివ్వబోమని నినదించారు. గాలి, నీరు, నేల కలుషితమయ్యే పరిశ్రమలు మాకొద్దు అంటూ తెగేసి చెప్పారు. అంతే కాకుండా కాలుష్యం వెదజల్లే పరిశ్రమల వల్ల తరతరాలుగా జీవిస్తున్న తామంతా ఊళ్లను వదిలి వలసలు పోయే దుస్థితి వస్తుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పెల్లుబికిన ప్రజా వ్యతిరేకత

దివీస్ కు వ్యతిరేకంగా ప్రభావిత గ్రామాలయిన తాటకులపాలెం, పంపాదిపేట, కొత్తపాకల గ్రామాలలో బాటు దానవాయిపేట,ముసలయ్యపేట తదితర మరో పది మత్యకార గ్రామాలకు చెందిన వేలాది మంది ఉద్యమించారు. సుదీర్ఘ కాలం పాటు సాగిన ఉద్యమంలో పోలీసులు బెదిరింపులు, లాఠీచార్జీలు, అక్రమ కేసులకు జంకకుండా పరిశ్రమను వ్యతిరేకించారు. కాలుష్యం వల్ల సమస్త నాశనమవుతుందని సర్కారు విధానాలపై పోరాడారు. తమ భూములను వదులుకునేందుకు సిద్ధంగా లేమని రైతులు, పరిశ్రమ ఏర్పాటుతో కాలుష్యం వల్ల ఇబ్బందులు పడతామని ప్రజలు, సముద్ర జీవుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని వత్తిదారులు నిరాటంకంగా పోరాడారు.

బాసటగా నిలిచిన సిపిఎం

దివీస్ పరిశ్రమను స్థానిక ప్రజలు, రైతులు, మత్స్యకారులు, వ్యతిరేకిస్తున్నట్లు తెలుసుకున్న సిపిఎం బాధితుల పక్షాన నిలిచి పోరాడింది. జిల్లా ,రాష్ట్ర స్థాయి నాయకత్వం రంగంలోకి దిగింది. పలు ప్రజా సంఘాల నాయకులు కూడా బాధితుల పక్షాన పోరాడారు. దాంతో దివిస్ రైతుల్లో పోరాట పటిమ రెట్టింపుయ్యింది. 2016 ఆగస్టు 29న రెండవ రోజు సీపీఎం జిల్లా నాయకులు అక్కడకు చేరుకున్నారు. బాధితుల తో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మీకు మేము అండగా ఉన్నామంటూ వాళ్ళకు భరోసా ఇచ్చారు. దాంతో ప్రభుత్వ యంత్రాంగం కంగారు పడింది. పోలీసులను ఉసిగొల్పి కమ్యూనిస్టు నేతలను బెదిరించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. దాదాపు 9 నెలల పాటు జరిగిన ఉద్యమంలో ఎక్కడ సిపిఎం నాయకులు వెనకడుగు వేయకుండా పోరాడారు.అరెస్టులకు కంగారు పడలేదు. లాఠీ దెబ్బలను లెక్క చేయలేదు. అక్రమ కేసులను పట్టించుకోలేదు. పోలీసుల దాష్టీకానికి భయపడలేదు.అలాగే పిడిఎఫ్ ఎమ్మెల్సీలు రాము సూర్యారావు, బొడ్డు నాగేశ్వరరావు, వి.బాల సుబ్రహ్మణ్యం లు కూడా దివిస్ లో పర్యటించి బాధితులకు భరోసా ఇచ్చారు. ఇంకా అనేక రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, మానవ హక్కుల సంఘాల నేతలు, న్యాయవాదులు



పర్యటించి బాధితులకు బాసటగా నిలిచారు.

ప్రభుత్వ నిర్బంధం

దివిస్ వ్యతిరేకులపై ప్రభుత్వం నిర్బంధం ప్రకటించింది. బాధితులకు అండగా నిలిచిన సిపిఎం నేతలతో సహా, ఇతర పార్టీల నాయకులు,ముందుండి పోరాడుతున్న రైతులను అణగదొక్కలని ప్రయత్నాలు చేసింది. అధికార అహంతో ఏకపక్షంగా వ్యవహరించింది. 2016 సెప్టెంబర్ 6న బాధితులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా బహిరంగ సభ నిర్వహించేందుకు సిపిఎం సహా మరికొన్ని పార్టీలు ప్రయత్నించాయి. దీంతో పోలీసులు భారీ సంఖ్యలో మోహరించి నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధును బలవంతంగా లాక్కెళ్లి జీపులో పడేసారు.ఆయన పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు అమనుశమంటూ ప్రజలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.అలాగే రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావును కూడా ఈడ్చుకుంటూ వెళ్లారు. మహిళలు,వద్ధులు అనికూడా చూడకుండా కర్కశంగా వ్యవహారించారు. సుమారు 2 వేల మంది పోలీసులను ప్రయోగించి ఉద్యమంపై ఉక్కుపాదం మోపేందుకు సర్కారు ప్రయత్నించింది. తునిలో వైసీపీ ఎమ్మెల్యే దాడిశెట్టి రాజాను,పెరుమల్లపురంలో సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు జి.బేబిరాణి ని, ఏ.కొత్తపల్లి లో మాజీ ఎంపీ హర్షకుమార్లను పోలీసులు అరెస్టు చేసి నిర్బంధించారు. నేతల బలవంతపు అరెస్టులకు నిరసనగా పంపాదిపేట బీచ్ రోడ్డుపై గ్రామస్తులు బైఠాయించి పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు.

హైకోర్టు నుండి సభకు అనుమతి

దివిస్ ప్రాంతంలో పోలీసులు బహిరంగ సభకు అనుమతి ఇవ్వకపోవడంతో సిపిఎం నాయకులు హైకోర్టు నుండి అనుమతి తీసుకొచ్చి సభ నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల, అతని సోదరుడు కలిసి సభను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోరాటంలో పాల్గొన్న యువకులను బెదిరించేందుకు పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేసారు. అయినా బాధితులు వెనకడుగు వేయకుండా పోరాడారు.దివిస్ ను విరమించుకోకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని తాటకుల పాలెంలో జరిగిన బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు తీవ్రస్థాయిలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు.మంత్రి యనమల తీరును దుయ్యబట్టారు.పోలీసులు విదించిన అక్రమ కేసుల్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

శ్రమజీవులు పండుగ మేడే...

ఉత్పత్తిలో భాగస్వాములయ్యే శ్రమ జీవుల పండగే మేడే. కాకినాడ జిల్లాలో సిఐటియు ఆఆధ్వర్యంలో 750 ప్రాంతాల్లో మేడే దినోత్సవం జరుగనుంది. ఇతర కేంద్రం కార్మిక సంఘాల ఆధ్వర్యంలోనూ మేడే పతాకావిష్కరణలు జరుగుతాయి. ఎవరికీ అనుబంధం కాని సంఘాలు, శ్రేణులు కూడా మేడేను జరుపుకుంటారు. సంఘాల్లోనే లేని శ్రమజీవులు కూడా ఇందులో పాలుపంచుకోవడం మేడే విశిష్టత.

1864లో అనేక దేశాల కార్మిక సంఘాలన్నీ కలిపి అంతర్జాతీయ సభను తొలిసారిగా జరుపుకున్నారు. అదే ఫస్ట్ ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ దీనికి స్వయంగా కారల్ మార్క్స్ నాయకత్వం వహించగా లండన్‌లో జరిగింది. 8 గంటల పని దినం కోసం పోరాడాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఇది జరిగిన తర్వాత 1886లో అమెరికాలో చికాగోలో పెద్ద ఎత్తున కార్మిక వర్గం 8 గంటల పని దినం కోసం వీధిల్లోకి వచ్చారు. ఆ రోజు నుంచి ప్రపంచవ్యాప్తంగా మేడే దినోత్సవం మే 1న జరుపుకుంటున్నారు. భారతీయులు గర్వించాల్సిన విషయం ఏమిటంటే ప్రపంచ కార్మిక వర్గం కంటే ముందే భారత కార్మిక వర్గమే ఈ డిమాండ్‌ను ముందుగా లేవనెత్తింది. 1862లో అంటే శ్రీకాకుళం ప్రారంభం కావడానికి 24 సంవత్సరాల ముందే పశ్చిమ బెంగాల్‌లోని హౌరా రైల్వే కార్మికులు ఇదే డిమాండ్ లేవనెత్తి సమ్మె చేశారు. ఆనాటి నిర్మాణ పరిస్థితుల నేపథ్యంలో సమ్మె విజయవంతం కాలేకపోయింది. ఘోర పరాజయం పాలైనా ప్రపంచ కార్మికోద్యమ చరిత్రలో మకుటాయమానమైన స్థానాన్ని పొందింది. భారతదేశంలో తొలిసారి అరుణ పతాకం 1923లో ప్రముఖ స్వతంత్ర సమరయోధుడు కమ్యూనిస్టు పార్టీ నాయకుడు కార్మిక నాయకుడు సింగారవేలు చెట్టియ్యార్ ఎగరవేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1937 నుంచి మేడే జరుగుతున్నది. సివికె.రావు, పిఎస్.శర్మ, బాలాజీ దాసు వీరంతా తొలితరం శ్రామిక జనభాంధవులు.

ఈరోజు భారత కార్మికోద్యమంపై పని గంటల రూపంలో లేబర్ కోడ్స్ రూపంలో తీవ్రమైన దాడి జరుగుతున్నది. రోజుకి 12 గంటల నుంచి 14 గంటలు పని చేయాలని ఒత్తిడి పెరిగింది. కాకినాడ జిల్లాలో 40 వేలమంది మహిళా కార్మికులు ఆక్వా రంగంలో పనిచేస్తున్నారు. వీరంతా ఆధ్మా పాతాళంలోని వేతనాలతో పని చేస్తున్నారు. వారికి ఏ చట్టము వర్తించడం లేదు. మైనస్ డిగ్రీల టెంపరిచర్ లో కోల్డ్ స్టోరేజ్ లో పనిచేస్తున్నారు. కాకినాడ సిటీలో పరిసర ప్రాంతాలలో కొన్ని వేల మంది శ్రామిక మహిళలు షాపింగ్ మాల్స్, హాస్పిటల్స్ లో రోజంతా నిలుచుని సేవలందిస్తున్నారు. మహిళలకు ప్రత్యేక వాష్ రూమ్స్ కూడా లేని పరిస్థితుల్లో పనిచేస్తున్నారు.

కూనరిల్లిపోతున్న శ్రామిక మహిళల వేతనాలు, పరిస్థితులండగా ఉత్తేజాన్నిచ్చే మహిళా పోరాటాలు ఈ జిల్లాలో శిఖర స్థాయిన జరుగుతున్నాయి. వేల సంఖ్యలో అంగన్వాడీలు, ఆశా కార్మికులు, మధ్యాహ్నం భోజన పథకంలో పనిచేసే కార్మికులు, వీరి పోరాటాలు శ్రామిక మహిళలకు ఆఖరికి పోలీసు శాఖలోని మహిళలను కూడా ఉత్సాహపరుస్తున్నాయి. అంగన్వాడీలు 42 రోజుల అసాధారణ సమ్మెనూ నడిపి కార్మికొద్యమాన్ని ఉత్సాహపరిచారు.

జిల్లాలో లక్షల సంఖ్యలో ఉన్న భవన నిర్మాణ కార్మికులు, వారంతా మేడే జరుపుకో బోతున్నారు. వారికి ఉన్న ఒకే ఒక్క సంక్షేమ బోర్డును జగన్మోహన రెడ్డి ప్రభుత్వం బుట్టదాఖలు చేసేసారు. తాను వచ్చి ఉద్ధరిస్తానన్నా చంద్రబాబు నాయుడు ఏడాది గడుస్తున్నా ఇంకా పునరుద్ధరించలేదు. తమ ప్రభుత్వం మొదటి క్యాబినెట్ సమావేశంలోనే తీర్మానం చేసి అమలు చేస్తామని కార్మిక శాఖ మంత్రి ప్రగల్భాలు పలికారు. ఇదే విషయంపై మూడు రోజుల క్రితం ఉప ముఖ్యమంత్రి వారిని కలవగా మీకు ఇంకా అమలు కావడం లేదా అని ఆశ్చర్యం ప్రకటించారు. అమలు అవుతుందో లేదో కూడా తెలియని పరిస్థితుల్లో ఉప ముఖ్యమంత్రి వారు ఉన్నారు.

జిల్లాలో పారిశ్రామిక ప్రాంతంలో ఏ ఒక్క పరిశ్రమలోనూ సరైన భద్రతా సౌకర్యం లేదు. కాకినాడ, పెద్దాపురం, సామర్లకోట, జగ్గంపేట అన్నిచోట్ల నిత్యం ప్రమాదాల మధ్యనే పనిచేస్తున్నారు. అంబటి ఆయిల్స్,పట్టాభి ఆగ్రో ఫుడ్స్, రాక్ సిరామిక్ ప్యారీ శుగర్స్ కాకినాడ పోర్టు, ఫ్యాబ్రికేషన్ వర్క్స్ లో ఆక్వా రంగంలో నిత్యం ప్రమాదాలే గంటల తరబడి కార్మికులు నిరసన వ్యక్తం చేసినచోట మాత్రమే మతుల కుటుంబాలకు పరిహారం అందుతున్నది.


పోరాడి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలన్నీ రద్దు చేసేస్తున్నారు. ట్రేడ్ యూనియన్ చట్టం,పారిశ్రామిక వివాదాల చట్టము, ఫ్యాక్టరీలు చట్టము, ప్రావిడెంట్ ఫండ్ చట్టం ఇవన్నీ రద్దు చేసేస్తున్నారు. ఈ చట్టాలు ఉండగానే యాజమాన్యాలు సరిగా అమలు చేయడం లేదు. రద్దు చేసిన ఈ చట్టాల స్థానంలో లేబర్ కోడ్స్ వస్తున్నాయి. అవి పూర్తిస్థాయిలో యాజమాన్యాల కొమ్ముగాయడానికే ఉపయోగపడతాయి. స్వాతంత్రానికి ముందే ఈ జిల్లాలో కార్మికోద్యమం సమరశీలంగా పోరాడింది. రైల్వే కార్మికులు, కాకినాడ పోర్టు కార్మికులు, ఓడల్లో పనిచేసే కార్మికులు, తాటి నార కార్మికులు, సామర్లకోట షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, పందలపాక స్పిన్నింగ్ బిల్లు కార్మికులు, రాజమండ్రిలో పేపర్ మిల్లు వీరంతా ఆనాటి యాజమాన్యాలను ఎదిరించి పోరాడారు.పనిగంటల కోసం తగ్గింపు కోసం వేతనాల పెంపు కోసం పోరాడారు. బ్రిటిష్ యాజమాన్యాన్ని ఎదిరించి ఈ జిల్లా కార్మికులు అంతకంటే ఘోరమైన పని పరిస్థితిలను కల్పించుతున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలకు సన్నద్ధమవుతున్నారు. మేడే దినోత్సవం నా డు కార్మిక వర్గమంతా తీసుకునే ప్రతిజ్ఞ ఏమిటంటే కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న లేబర్ కోడ్స్ నూ వ్యతిరేకిస్తూ మే 20న జరగబోతున్న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలి.

- దువ్వా శేషబాబ్జి

అవుట్ సోర్సింగ్

కార్మికుల జీవితాలతో

ప్రభుత్వం చెలగాటం



ఆప్కాస్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు

రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలకు గతంలో వైసిపి పాలనలో పేర్లు మార్చిన ట్లుగానే ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వం కూడా అదే పనిచేస్తున్నది. ప్రభుత్వ మద్యం షాపుల స్థానంలో ప్రైవేటు షాపులకు అనుమతులు ఇచ్చింది. దాంతో 15 వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారు. సచివాలయాల వ్యవస్థను తొలగించి అందులో పనిచేస్తున్న ఉద్యోగులను వారి మాతృ సంస్థలకు అప్పగించేందుకు కసరత్తు చేస్తుంది. దీని వల్ల 15,700 మంది మిగులు తేలుతు న్నారని ప్రభుత్వం ప్రకటించింది. లక్ష మందికి పైగా నమోదైన ఆప్కాస్ వ్యవస్థను రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు పొరుగు సేవల సిబ్బందిని అప్పగించేందుకు మంత్రివర్గం తీర్మానించినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో సచివాలయ ఉద్యోగుల్లోనూ, అటు ఆప్కాస్ ఉద్యోగుల్లోనూ తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి.

ప్రైవేటు ఏజెన్సీలకు సంబంధించిన అనుభవాలు

ఆప్కాస్ రాకముందు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు మధ్యవర్తి లేదా థర్డ్ పార్టీ ద్వారా నిర్వహించబడేవి. ప్రైవేట్ వ్యక్తులు/సంస్థల ఆధీనంలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నియామ కాలు జరిగేవి. మున్సిపల్ రంగంలో అనుభ వాలు పరిశీలిస్తే ఈ సంస్థలు ఏనాడూ సక్ర మంగా జీతాలు చెల్లించిందిలేదు. కార్మికులు నెలంతా పని చేసినా ఏదో ఒక రకమైన సాకులతో జీతాలలో కోతలు పెట్టేవారు. పిఎఫ్, ఇఎస్ఐ నిధులు ఆయా ఖాతాలలో సక్రమంగా జమ చేసేవారు కాదు. చట్టబద్ధమైన సెలవులు అమలు జరిగేవి కావు. కార్మికులకు పనిముట్లు ఇచ్చేవారు కారు. ప్రమాదాలకు గురైన కార్మి కులను పట్టించుకునేవారు కారు. బకాయి జీతాల కోసం వారాల తరబడి ధర్నాలు, ప్రదర్శనలు, సమ్మెలు చేయాల్సి వచ్చేది. లేబర్ అధికారులకు పిర్యాదులు చేసినా స్పందన వుండేది కాదు. కాంట్రాక్టర్లను/దళారీలను సమస్యల గురించి ప్రశ్నిస్తే సమస్యలు పరి ష్కరించకపోగా కక్ష సాధింపు చర్యలకు ఒడిగట్టే వారు. వారం-పది రోజులు పని నుండి నిలిపేయడం, లేదంటే ఉద్యోగం నుండి తొలగించేవారు. ప్రైవేట్ కాంట్రాక్టర్లే కార్మికులకు వడ్డీలకు అప్పులు ఇచ్చి దోచుకుతినే వారు. కార్మికులు నిత్యం అభద్రతలో బతకాల్సి వచ్చేది.

ఆప్కాస్‌తో కార్మికులకు జరిగిన లాభనష్టాలు

గత వైసిపి ప్రభుత్వం రాక ముందు ప్రతి మున్సిపాలిటీలో పారిశుధ్య పనికి ఒకరు, ఇంజనీరింగ్ సెక్షన్ లోని వివిధ విభాగాలకు వేర్వేరు కాంట్రాక్టర్లు వుండేవారు. ఈ కాంట్రా క్టర్ల ద్వారానే కార్మికులకు జీతాలు చెల్లించే వారు. కార్మికులకు ఎదురయ్యే సమస్యలను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకు వెళితే మాకు సంబంధం లేదని సమాధానం వచ్చేది. కాంట్రాక్టర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బతకాల్సి వచ్చేది.

గత వైసిపి ప్రభుత్వం మున్సిపాలిటీలలో వున్న థర్డ్ పార్టీ ఏజెన్సీలను తొలగించి వాటి స్థానంలో టౌన్ లెవల్ ఫెడరేషన్ (టి.ఎల్.ఎఫ్) లకు అధికారాలు ఇచ్చింది. మరలా టౌన్ లెవల్ ఫెడరేషన్ లను తొలగించి. 2019 ఆగస్టు ఒకటిన ఆప్కాస్‌ను ప్రారంభించింది. ఆప్కాస్ అంటే "ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీస్".

గతంలో ఊరూరా ఉన్న కాంట్రాక్టర్ల వ్యవస్థను తొలగించి ప్రభుత్వమే 'ఆప్కాస్' సంస్థను ఏర్పాటుచేసి ప్రత్యేక సంస్థగా నడుపుతున్నది. దీని ద్వారా కార్మికులకు జీతాలు చెల్లిస్తున్నారు. ఆప్కాస్ నిర్వహణ నిమిత్తం జీతాల బడ్జెట్ నుండి ఒక శాతం వసూలు చేస్తున్నారు. వివిధ శాఖలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు లక్ష మందిని సభ్యులుగా చేర్చారు. అందులో 45 వేల మందికి పైగా మున్సిపల్ కార్మికులు ఉన్నారు. దీని ద్వారా ప్రతి నెలా 1 లేదా 2వ తేదీనే జీతాలు కార్మికుల అకౌంట్‌కి వస్తున్నాయి. జీతాలలో ఏ విధమైన కోతలు లేవు, పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ వాటా నిధులు ఆయా ఖాతాలలో జమ అవుతున్నాయి. కాంట్రాక్టర్ల బెడద లేదు. కనుక కార్మికులకు ఆప్కాస్ వల్ల కొంత భరోసా ఏర్పడింది. అయితే ఆప్కాస్‌లో వీరిని ఉద్యోగులుగా నమోదు చేయడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు కట్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్లు ఇవ్వకుండానే 60 ఏళ్లకు బలవంతంగా రిటైర్మెంట్ చేశారు. అనారోగ్యం పాలయిన లేదా చనిపోయిన వారి స్థానాలలో వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వడం లేదు.

స్వర్గం చూపిస్తారనుకుంటే నరకంలోకి తోసేస్తున్న కూటమి ప్రభుత్వం

గత మార్చి ఆరవ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్ రద్దు చేసి పొరుగు సేవల సిబ్బంది నియామకాలు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని తీర్మానించి నట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఈ వార్త మున్సిపల్ కార్మికులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. కార్మికుల్లో నెలకొన్న భయాందో ళనలను మంత్రి డాక్టర్ పి.నారాయణతో పాటు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లనప్పుడు వారు ఖండించలేదు. సాధారణంగా ప్రతి నెల 20వ తేదీ మున్సిపల్ కార్మికుల జీతాల బిల్లులు ఆప్కాస్ సైట్ నుండి తీసుకునే సాంప్రదాయం వుంది. మార్చి నెల బిల్లులు 27వ తేదీ వచ్చినా నేటికీ తీసుకోలేదు. ఈ స్థితిలో మార్చి నెల జీతం ఎప్పుడు వస్తుంది? జీతం ఎవరిస్తారు? అనేది స్పష్టత లేదు. ప్రస్తుతం కార్మికుల్లో గందరగోళం నెలకొంది. కార్మికుల్లో నెలకొన్న ఆందోళనను నివృత్తి చేసి వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిదే.

పర్మినెంట్ చేయాల్సిందే

మున్సిపాలిటీలలో ఇంజనీరింగ్, పారిశు ధ్య పనులన్నీ ఎమర్జెన్సీ సర్వీసు కిందకే వస్తాయి. అంతేకాదు అపాయకరమైనది, ప్రమాదకరమైనది. శాశ్వత స్వభావం కలిగినది. పైగా విష వాయువులను భరిస్తూ ప్రతిరోజూ గంటల కొద్దీ పని చేయాల్సి వుంటుంది. 1971లో ప్రభుత్వం జారీచేసిన కాంట్రాక్టు వర్కర్స్ రెగ్యులేషన్ అండ్ అబాలిషన్ యాక్టు ప్రకారం కోర్ యాక్టివిటీ (శాశ్వత స్వభావం కలిగిన పని) పని కాంట్రాక్టు (నేరుగా మున్సి పాలిటీ లేదా ప్రభుత్వం జీతాలు చెల్లించే విధానం) లేదా పర్మినెంట్ సిబ్బందితోనే చేయించాలి. మున్సిపాలిటీ పని ఈ కోవకు చెందినదే. అలా చేయించుంటే ఎప్పుడో పర్మినెంట్ అయ్యేవాళ్లు. అలాంటి అవకాశాన్ని 2002లో లేకుండా చేస్తూ అంతకు పూర్వం నుంచి కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులను అవుట్ సోర్సింగ్‌లోకి మార్చింది నాటి టిడిపి ప్రభుత్వమే. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించి కార్మికులకు అన్యాయం చేశాయి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013లో సిఐటియు అనుబంధ సంఘం ఆధ్వర్యంలో జరిగిన పోరాటం ఫలితంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం పిఆర్‌సి జీతాలు, డిఎ, ఐఆర్ చెల్లించినప్పుడు మున్సిపల్ కార్మికులకు కూడా ఇవి చెల్లించాలని, జీఓఆర్‌టి నెంబర్ 1615లో పేర్కొన్నారు. అలాగే 2015లో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు పర్మినెంట్ వారితో సమానంగా పని చేస్తున్న డైలీ వేజ్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ తదితర పేర్లతో పని చేసే వారికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని చెప్పింది. 2018లో విభజిత ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా టైమ్ స్కేల్ జీతాలు 2019 జనవరి నుండి చెల్లిస్తామంటూ జీ.ఓ.ఆర్.టి నెంబర్ 96ను ప్రభుత్వం జారీ చేసింది. అయినా ప్రభుత్వాలు ఇవేవీ నేటికీ అమలు చేయలేదు.

ఏటేటా పట్టణాలు విస్తరిస్తున్నాయి. ఘన, ద్రవ వ్యర్థాల పరిమాణం పెరుగుతుంది. అందుకు అనుగుణంగా సిబ్బంది సంఖ్యను పెంచడం లేదు. ఈ నాటికీ అనేక పట్టణాలలో కోవిడ్, బదిలీ, ఎన్.ఎం.ఆర్ వంటి పేర్లతో కనీసం వేతనం రూ.21,000 ఇవ్వకుండా రూ.4 వేల నుండి రూ.12,000 మధ్య చెల్లిస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారు.

మున్సిపల్ కార్మికులు చేసే పని ఇతరులు ఎవరూ చేయలేరని పాలకులందరూ పొగుడుతుంటారు. ప్రమాదకరమైన కరోనా సమయంలో 'ఫ్రంట్‌లైన్ వారియర్స్' అని పేరుపెట్టి పని చేయించుకుని చేతులు దులిపేసుకున్నారు. గతంలో విశాఖ హుదూద్ తుఫాన్, ఇటీవల విజయవాడ వరదల్లో కనీసం తిండి పెట్టకుండా, కనీస వసతులు కల్పించకుండానే వెట్టి చాకిరీ చేయించారు. ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నారు. కనుకనే పర్మినెంట్ చెయ్యాలని కోరుతున్నారు. వీరి న్యాయమైన పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇచ్చి తోడ్పడాలని కోరుతున్నారు.

- కె.ఉమామహేశ్వరరావు

సర్కారు బడి...

'ప్రపంచాన్ని మార్చడానికి మీరు ఉపయోగించగల అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య' అంటారు నెల్సన్ మండేలా. సమాజ పురోగమనంలో విద్య యొక్క కీలక పాత్రను ఆయన నొక్కి చెప్పారు. భారతదేశంలో మితవాద ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానం జాతి భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతోంది. నయా ఉదారవాద విధానాల పుణ్యమా అని సమాజంలో ఎక్కువ మందికి నాణ్యమైన విద్య అందని ద్రాక్షలా మారింది. 'ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు అందరూ ఉద్యమించాలని, విద్య అందరికీ చేరువైతేనే సామాజిక న్యాయం దక్కుతుందని, మోడీ ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యావిధానం ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తుందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచకపోగా, రేషనలైజేషన్ పేరుతో పెద్దయెత్తున ప్రభుత్వ స్కూళ్లు మూసివేసేందుకు రాష్ట్రప్రభుత్వం యత్నిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచే ప్రక్రియలో ఉపాధ్యాయులు క్రియాశీలకంగా వ్యవహరించాలని, తల్లిదండ్రులను కలిసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో ఉంచేటట్లు బాధ్యత తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ పిలుపునివ్వడం అత్యంత సముచితం. 'ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం' అన్న నినాదం ఊపందుకోవాలి.

ప్రభుత్వ పాఠశాల అంటేనే... చిన్నచూపు. ఉన్నతమైన చదువులు చదవాలంటే కార్పోరేట్ పాఠశాలలు, కాలేజీలే మేలన్న అపోహతో కొందరు ఎల్‌కెజీ నుంచే లక్షలు ఖర్చుచేసి ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివిస్తున్నారు. రాష్ట్రంలో బడి ఈడు పిల్లల్లో 49 శాతం మంది మాత్రమే ప్రభుత్వ బడుల్లో చదువుతుండగా, ప్రైవేట్ బడుల్లో చదివేవారి సంఖ్య 51 శాతానికి పెరగడం ఆందోళన కలిగిస్తోంది. 2021 ఏప్రిల్ నాటికి ప్రభుత్వ లెక్కల ప్రకారం... ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య 44,54,038. జీవో 117 పేరుతో పాఠశాలల సంఖ్యను కుదించిన తర్వాత...కచ్చితమైన లెక్కలు బహిర్గతం కావడంలేదు. ఉపాధ్యాయ సంఘాలు సేకరించిన సమాచారం మేరకు 1, 2 తరగతులు మాత్రమే నిర్వహించే బడులు 4600 వుంటే, దానిలో 20లోపు ఎన్‌రోల్‌మెంట్ ఉన్న బడులు 2,730. ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థుల సంఖ్యను పరిగణలోకి తీసుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా 27 వేల పైచిలుకు ఉంటే... 20 లోపు విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలలు 8,900 వరకు ఉన్నాయి. సుమారుగా 12,000 ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయులతో నడుస్తున్నాయి. ఎన్‌రోల్‌మెంట్‌కు సంబంధించిన వివరాలు ప్రభుత్వం అధికారికంగా ఎక్కడా వెబ్‌సైట్‌లో పెట్టలేదు. కానీ, 36 లక్షలకు పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం లేదని లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వ బడుల్లో పెద్దఎత్తున ఖాళీగా వున్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకపోవడం, తగినన్ని మౌలిక వసతులు కల్పించకపోవడం వల్ల విద్యలో నాణ్యత పడిపోతోంది. దీంతో ప్రభుత్వ బడులకు తమ పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు సంకోచిస్తున్నారు. విద్యార్థులు తగినంత మంది లేరన్న సాకుతో ప్రభుత్వం వీటిని మూసివేస్తోంది. ఇదంతా విద్య ప్రైవేటకరణకు ప్రభుత్వం ఆడుతున్న నాటకం.

తల్లిదండ్రులు సైతం... ప్రభుత్వ బడుల్లో చదువు చెప్పే ఉపాధ్యాయుల ప్రతిభను గుర్తించడం లేదు. ప్రభుత్వం బడి పట్ల నమ్మకాన్ని కలిగించడంతో పాటు, పిల్లలందరికీ నాణ్యమైన విద్య ఆ యా తరగతిలో సామర్థ్య ఆధారిత బోధన అందిస్తామనే భరోసాను, నమ్మకాన్ని తల్లిదండ్రులకు కలిగించాలి. పాలకుల ప్రైవేటీకరణ విధానాలను ప్రతిఘటిస్తూనే... ప్రభుత్వ బడులను రక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలి. అంతేకాదు, ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించేందుకు తల్లిదండ్రులను, విద్యావేత్తలను కలుపుకుని ఒక ఉద్యమంగా కదలాలి. నాణ్యమైన విద్యకు ప్రాధాన్యమివ్వడంలో కేరళ దేశంలోనే ప్రథమ స్థానంలో వుంది. విద్యపై చేసే ఖర్చును భావితరాల భవితకు పునాదిగా చూస్తున్నది కేరళ వామపక్ష ప్రభుత్వం. ఇలా నాణ్యమైన విద్య అందించడమన్నది ప్రభుత్వ అజెండాగా వుండాలి. అయితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడమే ఎజెండాగా పెట్టుకున్నాయి. ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ బడిని కాపాడుకోవడం ద్వారానే సమాజంలో అందరికీ విద్య అందుబాటులోకి వస్తుంది. ప్రభుత్వ బడి అమ్మ ఒడిలా మారాలి. ప్రతి చిన్నారీ బడి మెట్లెక్కాలి. అప్పుడే ప్రభుత్వ విద్య లక్ష్యం సాకారమౌతుంది. నైతిక, రాజ్యాంగ విలువలు పరిరక్షించబడతాయి.